అందరికీ తిరుపతే కావాలంట

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరుగుతున్న ఉద్యోగుల బదిలీల్లో ఎక్కువ మంది తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాల్లో పనిచేసేందుకు ఇష్టపడుతున్నారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి తిరుపతికి వెళ్లేందుకు పెద్దఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. కానీ, తిరుపతి నుంచి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు వచ్చేవారు కరువయ్యారు. ఈ సమస్యపై బుధవారం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు జూమ్ కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించనున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



చిత్తూరు జిల్లాలో 43 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో తిరుపతికి 31 మంది, అన్నమయ్యకు 12 మంది వెళ్తామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ విషయానికొస్తే.. డిప్యూటీ తహసీల్దార్లు చిత్తూరు నుంచి తిరుపతికి 8 మంది, అన్నమయ్యకు ముగ్గురు, అన్నమయ్య నుంచి తిరుపతికి ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. వీఆర్వోలు చిత్తూరు నుంచి తిరుపతికి 10 మంది, అన్నమయ్యకు 13 మంది వెళ్తామంటున్నారు. సీనియర్ అసిస్టెంట్లు చిత్తూరు నుంచి తిరుపతికి ఐదుగురు, అన్నమయ్య జిల్లాకు ముగ్గురు, అన్నమయ్య నుంచి తిరుపతి ఒకరు వెళ్లాలని దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రస్తుత చిత్తూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలో పనిచేసే వారిలో ఎక్కువ మంది ఇప్పటికీ తిరుపతిలోనే నివాసం ఉంటున్నారు. రోజువారీగా విధులకు వచ్చి వెళుతున్నారు. వీరంతా తిరుపతి జిల్లాకు దరఖాస్తు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇలా బదిలీ అవసరమున్న ఉద్యోగులు తమకు పరిచయమున్న కూటమి నేతల ద్వారా ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు సంపాదిస్తున్నారు. అటెండర్ల నుంచి అధికారుల వరకు.. తాము చేసుకున్న దరఖాస్తుకు ఆయా ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల్ని కచ్చితంగా జత చేస్తున్నారు. బదిలీకి అవకాశం లేని వారి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో అధికారులకు అర్థం కావడం లేదు.

సిఫార్సు లేఖలతో ఉద్యోగుల ప్రయత్నాలు ముమ్మరం

చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు వచ్చేవారు కరువు

బదిలీలపై నేడు మూడు జిల్లాల కలెక్టర్ల సమీక్ష

మ్యూచ్యువల్ ఉంటేనే అనుమతి

తన జిల్లా నుంచి ఒక ఉద్యోగిని కలెక్టర్ రిలీవ్ చేయాలంటే కచ్చితంగా అదే హోదా కలిగిన వ్యక్తి బయటి నుంచి రావాల్సి ఉంది. అందరూ చిత్తూరు నుంచి వెళ్లిపోతామనే దరఖాస్తులు చేసుకుంటున్నారే తప్ప, జిల్లాకు వస్తామనే దరఖాస్తులు లేవు. అధికారులకు ఇది పెద్ద తలనొప్పిగా మారింది. దీంతో మ్యూచ్యువల్ ఉంటేనే బదిలీలను పరిగణనలోకి తీసుకోనున్నారు. అంటే చిత్తూరు నుంచి తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు వెళ్లాలని దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల స్థానంలో అక్కడి నుంచి అదే హోదా కలిగిన ఉద్యోగి చిత్తూరుకు వస్తేనే బదిలీ చేస్తారు. లేకుంటే పరిగణనలోకి తీసుకునే అవకాశాలు తక్కువ. తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి రావాలన్నా ఇదే సూత్రంగా అమలు చేస్తున్నారు.

ఎవరైనా 'అన్నమయ్య'కు వస్తారా?

అన్నమయ్య జిల్లా మదనపల్లె మున్సిపాలిటీలో పనిచేసే ఓ ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ భర్త చిత్తూరు పక్కన తమిళనాడు రాష్ట్రంలో బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆమె చిత్తూరు చుట్టుపక్కల బదిలీ కోరుతూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ఆమెను చిత్తూరుకు పంపేందుకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ సిద్ధంగా లేరు. చిత్తూరు నుంచి అన్నమయ్య జిల్లాకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న అదే హోదా కలిగిన ఉద్యోగి కావాలి. చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా 'అలా చిత్తూరు నుంచి అన్నమయ్యకు వెళ్లేవారు ఉంటే చూసుకుని రండి' అంటూ వారికి సలహా ఇచ్చారు. దీంతో వారు అన్నమయ్య జిల్లాకు మ్యూచ్యువల్‌గా వచ్చే వారున్నారా అంటూ వెతికే పనిలో పడ్డారు.

ఇలాంటి ప్రత్యేక కేసుల్ని పరిగణలోకి తీసుకోవాలి

చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో పనిచేసే ఓ మహిళా వీఆర్వోకు తిరుపతికి బదిలీ అవ్వాల్సిన అవసరం ఉంది. ఆమె ఒంటరి మహిళ కావడంతో పాటు తన నాలుగేళ్ల కుమార్తె క్యాన్సర్‌తో బాధ పడుతోంది. తిరుపతిలోని తల్లిదండ్రుల వద్ద కుమార్తెను ఉంచి నిత్యం చిత్తూరుకు వచ్చి వెళ్లడం కష్టంగా మారింది. అదే తిరుపతిలో అయితే కుమార్తె బాగోగులు దగ్గరుండి చూసుకుంటూ ఉద్యోగం చేసుకోవచ్చు. ఆమె తిరుపతికి వెళ్లాలంటే అక్కడి నుంచి చిత్తూరుకు మరో వీఆర్వో రావాలనే నిబంధన ఉంది. తాజా బదిలీ తీరు చూసుకుంటే తిరుపతి నుంచి చిత్తూరుకు వచ్చేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. అందరూ తిరుపతే కావాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలో ఇలాంటి వారికి మానవతా దృక్పథంతో అధికారులు న్యాయం చేయాల్సి ఉంది.

రిజిస్ట్రేషన్ల శాఖలో బదిలీలపై ఉత్కంఠ

చిత్తూరు కలెక్టరేట్: స్టాంపులు- రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగుల బదిలీ మార్గదర్శకాలపై సబ్‌రిజిస్ట్రార్లలో ఉత్కంఠ నెలకొంది. ఆదాయార్జన శాఖ కావడంతో రెండేళ్లా? లేదా ఐదేళ్ల సర్వీసును ప్రాతిపదికగా తీసుకుంటారా? జీరో సర్వీసు అంటారా? అన్న దానిపై చర్చలు జరుగుతున్నాయి. బదిలీలకు అనుమతిచ్చి వారం రోజులవుతున్నా ఇంతవరకు మార్గదర్శకాలు అందలేదు. వైసీపీ హయాంలో ఈ శాఖలో బదిలీలు చాలావరకు ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే జరిగాయి. ఆ పార్టీ ప్రజాప్రతినిధులు తమకు అనుకూలమైన సబ్‌రిజిస్ట్రార్లను నియమించుకుని అడ్డగోలుగా భూ రిజిస్ట్రేషన్లకు పాల్పడ్డారంటూ ఆరోపణలొచ్చాయి. నగరి నియోజకవర్గంలోని సబ్‌రిజిస్ట్రార్లు అక్కడి ప్రజాప్రతినిధికి నెల మామూళ్లు ఇచ్చేవారని విమర్శలున్నాయి. అలాగే చిత్తూరు ఓ సబ్‌రిజిస్ట్రార్ అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి సస్పెండ్ కావడంతో పాటు జైలుకు కూడా వెళ్లారు. ప్రస్తుతం అలాంటివాటికి తావు లేకుండా పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని, మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారిని ఫోకల్ స్టేషన్లలో నియమించాలని ఉద్యోగవర్గాలు కోరుతున్నాయి. కాగా, రెండేళ్ల కిందట చాలామంది సబ్‌రిజిస్ట్రార్లు బదిలీల నుంచి తప్పించుకోవడానికి పలు ఉద్యోగ సంఘాల్లో సభ్యత్వాలు తీసుకున్నారు. వీరికి స్థాన చలనం నుంచి మినహాయింపు ఉంటుందని భావిస్తున్నారు. ఇదే జరిగితే చాలామందికి అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. పదవుల్ని చూసి అలాంటి వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వద్దని కొందరు సబ్‌రిజిస్ట్రార్లు కోరుతున్నారు.

ఊరందూరు టీచరుకు జాతీయ అవార్డు

తన కష్టానికి గుర్తింపు లభించిందన్న సురేష్



పాఠాలు బోధిస్తున్న కూనాటి సురేష్

శ్రీకాళహస్తి, ఆగస్టు 27 : అవార్డులకోసం తాను పని చేయలేదని, అయితే జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యానని తెలిసినపుడు తన శ్రమకు తగ్గ గుర్తింపు లభించినట్లు భావించానని సోషల్ టీచర్ కూనాటి సురేష్ చెప్పారు. శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామానికి చెందిన సురేష్ తన సొంత మండలంలోని ఊరందూరు ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తూనే విద్యారంగానికి ఎన్నో విశేష సేవలను అందించారు. ఆయన విశేష సేవలను రాష్ట్రప్రభుత్వం గుర్తించి జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రకటించింది.సెప్టెంబరు 5న ఢిల్లీలో జరిగే జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సురేష్ పురస్కారం అందుకోనున్నారు. రాష్ట్రం నుంచీ ఇద్దరే ఈ అవార్డుకు ఎంపికయ్యారు.పాఠ్యపుస్తకాలను రూపొందించడం, మారుతున్న సాంకేతిక విధానాలకు అనుగుణంగా డిజిటల్ కంటెంట్ క్రియేట్ చేయడం, ఉచిత పాఠ్యాంశాలను బోధించే మొబైల్‌యాప్ ఉచితంగా అందించడం వంటి ఎన్నో సేవలను ఆయన విద్యార్థులకు చేరువ చేశారు. విద్యార్థులకు అవసరమైన వర్క్ బుక్కులతో పాటు పిక్టోరియల్ సోషల్ స్టడీస్ అనే పుస్తకం ద్వారా దాదాపు వెయ్యి చిత్రాలను, మ్యాపులతో కూర్చి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా తయారు చేసి ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులకు విజయోస్తు, విజయ సాధన సంకల్పం, మహా సంకల్పం, విజయ స్ఫూర్తి పేర్లతో మెటీరియల్ తయారు చేసి సాంఘిక శాస్త్ర ఫలితాల్లో అగ్రభాగాన ఉండేందుకు కృషి చేశారు.విద్యాపరమైన శిక్షణా తరగతుల్లో రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు.డ్రాపౌట్ అయిన విద్యార్థుల తల్లిదండ్రులను తరచూ కలిసి వారిని మళ్లీ పాఠశాలకు పంపించేలా కౌన్సెలింగ్ ఇచ్చారు.డిజిటల్ మ్యాపులు తయారు చేసి ఉపాధ్యాయులందరికీ ఉచితంగా పంచిపెట్టారు.ఈయన ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తరపున జాతీయ ఉత్తమ ఐసీటీ ఉపాధ్యాయ అవార్డు, ఆంధ్రరత్నం అవార్డు, గ్లోబల్ బెస్ట్ టీచర్ అవార్డు, బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కార్ , గురుమిత్ర అవార్డు, జిల్లాస్థాయిలో రెండుసార్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ప్రావీణ్య ఫౌండేషన్ ప్రత్యేక గుర్తింపు అవార్డు అందుకొని వుండడం విశేషం.

సీఐల బదిలీలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 27: జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ షిమోషీ ఆదేశాలు జారీ చేశారు.తిరుపతిలో వీఆర్‌లో వున్న సుబ్బరాయుడిని ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుకు, జయచంద్రను ఏర్పేడుకు పంపించారు. ఏర్పేడు సీఐ శ్రీరామ్ శ్రీనివాస్‌ను వీఆర్‌కు పంపించారు. తిరుపతిలోని అలిపిరిలో పనిచేస్తూ ఇటీవల వీఆర్‌కు వెళ్లిన రామారావును మడకశిరకు బదిలీ చేశారు.రెండు మూడు రోజుల్లో మరో 10మంది సీఐలు బదిలీ కానున్నారు. తిరుపతి ఈస్ట్‌కు మధుబాబు, తిరుమల టూటౌన్‌కు మురళీమోహన్ నియమితులు కానున్నట్లు సమాచారం.

ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం



స్విమ్స్‌లో విద్యార్థికి అడ్మిషన్ అందజేస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 27: స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో 26 సీట్లకుగాను మంగళవారం తొలుతగా ఆరుగురు విద్యార్థులకు ఎంబీబీఎస్ అడ్మిషన్లను డైరెక్టర్ ఆర్వీకుమార్ అందజేశారు. వీరంతా నీట్ ఆలిండియా కోటాలో ర్యాంకులు సాధించిన పలు కేటగిరీలకు చెందిన విద్యార్థులు. అడ్మిషన్లు పొందిన వారిలో.. ఏపీ, ఢిల్లీ, జమ్మూకశ్మీర్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన ఒక్కో విద్యార్థితోపాటు కేరళకు చెందిన ఇద్దరు విద్యార్థులున్నారు. ప్రిన్సిపాల్ ఉషా కళావత్, ఏడీ శశికళ, సూపరింటెండెంట్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ వైద్య కళాశాలలో..

ఎస్వీ వైద్య కళాశాలలోనూ మంగళవారం ఐదుగురు విద్యార్థులకు ఎంబీబీఎస్ అడ్మిషన్లను ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ అందజేశారు. కళాశాలలో 240 సీట్లకుగాను తొలిరోజున హర్యానా, మహారాష్ట్ర, కేరళకు చెందిన ఒక్కో విద్యార్థితోపాటు ఢిల్లీకి చెందిన ఇద్దరు విద్యార్థులకు అడ్మిషన్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం



తిరుపతి గోశాలలో ఆవుకు గ్రాసం పెడుతున్న ఈవో శ్యామలరావు దంపతులు

తిరుమల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం గోకులాష్టమి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. వేంకటేశ్వరస్వామిని ద్వాపర యుగపురుషుడైన శ్రీకృష్ణుడిగా భావించి ఆస్థానం నిర్వహించారు. రాత్రి 8గంటలకు ఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, శ్రీకృష్ణస్వామికి ఏకాంత తిరుమంజనం నిర్వహించారు.అనంతరం ద్వాదశారాధనం చేపట్టారు. శ్రీకృష్ణస్వామిని బంగారు తిరుచ్చిపై బంగారు సర్వభూపాల వాహనంపై వేంచేపు చేసి ప్రబంధగోష్ఠి, పురాణ పఠనం చేపట్టారు. కాగా, బుధవారం శ్రీవారి ఆలయం ముందు ఉట్లోత్సవాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 4గంటలకు జరిగే ఈ ఉత్సవాన్ని చూడటానికి మలయప్పస్వామి, కృష్ణస్వామి తిరుచ్చిలపై కొలువుదీరి మాడవీధుల్లో విహరిస్తారు. స్థానిక యువత ఉట్లను కొడుతూ స్వామివార్లకు ఆనందాన్ని చేకూరుస్తారు. తిరుపతిలోని టీటీడీ గోశాలలో మంగళవారం గోకులాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గోపూజలో పాల్గొన్న ఈవో శ్యామలరావు సకల దేవతా స్వరూపమైన గోవును రక్షించడం ద్వారా సనాతన ధర్మాన్ని పరిరక్షించాలన్నారు. తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా పార్థసారథి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లాకర్ల పేరుతో మోసం

భక్తుల వద్ద వసూళ్లకు పాల్పడ్డ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్ట్

తిరుమల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): 'మీరు లాకర్ తీసుకుని ఏడాది అవుతోంది.సకాలంలో ఖాళీ చేయకపోవడంతో ఫైన్ పడింది.అది కట్టకుంటే మీ ఆధార్ కార్డును బ్లాక్ చేస్తాం' అంటూ శ్రీవారి భక్తులను బెదిరించి అందినకాడికి దోచుకున్న కర్ణాటకలోని ముల్బాగల్‌కు చెందిన తిలక్ శ్రీనివాస్‌ను తిరుమల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.శ్రీవారిసేవలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులు తిరుపతిలోని విష్ణునివాసంలో లాకర్లు తీసుకుని బస చేస్తుంటారు. అయితే తిలక్ శ్రీనివాస్ కొద్దినెలలుగా లాకర్లు పొంది తిరిగి వెళ్లిపోయిన భక్తులకు ఫోన్ చేసి తాను టీటీడీ నుంచి ఫోన్ చేస్తున్నానని, ఆ భక్తుల ఆధార్ నెంబరు, పేరు, లాకర్ పొందిన తేదీ వంటి వివరాలు తెలియజేసి.. మీరు తీసుకున్న లాకర్ ఖాళీ చేయకపోవడంతో ఫైన్ పడిందని, వెంటనే కట్టాలంటూ భయపెట్టేవాడు.వివరాలన్నీ కరెక్ట్‌గానే ఉండడంతో భక్తులు కూడా నమ్మి తిలక్ శ్రీనివాస్ అడిగినంత పంపేవారు. అయితే తాను దర్శనాలు కూడా చేయిస్తానని నమ్మించి తిలక్ శ్రీనివాస్ మోసం చేసేవాడు. ఇటీవల ఓ మహిళ వద్ద ఫైన్ వసూలు చేసిన తిలక్ శ్రీనివాస్ దర్శనం కూడా చేయిస్తానని చెప్పి చేతులెత్తేయడంతో ఆమె విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసింది. విజిలెన్స్ అధికారులు విచారణ మొదలుపెట్టగా అసలు అక్రమం బయటపడింది. కేసును తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించగా తిలక్ శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశారు. అయితే భక్తుల వ్యక్తిగత వివరాలు అతడి వద్దకు ఎలా వెళ్లాయనే అంశంపై దర్యాప్తు చేస్తున్నారు. కౌంటర్‌లో పని చేస్తున్న ఓ వ్యక్తి సహకారంతో భక్తుల వివరాలను తిలక్ పొందినట్టు సమాచారం. భక్తుల వ్యక్తిగత వివరాలు ఇలా బయటికి వెళ్లడంతో టీటీడీ ఉన్నతాధికారులు ఉలిక్కిపడ్డారు. ఇకపై ఇలా భక్తుల వ్యక్తిగత వివరాలు బయటకు వెళ్లే అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు.సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన తిలక్ తన తెలివితేటలను ఇలా భక్తులను మోసగించడానికి ఉపయోగించినట్టు గుర్తించిన పోలీసులు ఇప్పటివరకు ఎంతమందిని మోసం చేశాడు, ఎవరెవరు అతనికి సహకరించారు తదితర అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్కాన్‌లో ఘనంగా ప్రభుపాదుల ఆవిర్భావ వేడుకలు



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 27: తిరుపతిలోని ఇస్కాన్ శ్రీకృష్ణ ఆలయ వ్యవస్థాపకుడైన భక్తివేదాంత ప్రభుపాదుల 128వ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనం గా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయం 11గంటలకు ప్రభుపాదులకు మహాశంఖాభిషేకం జరిగింది. అనంతరం ప్రభుపాదుల లీలామృతంపై రేవతీరమణ దాసు ప్రవచనం చేశారు.తిరుపతిలో ఇస్కాన్ నిర్మాణానికి 1974లో ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో ఈ ఏడాదికి 50 సంవత్సరాలు పూర్తికావడంతో సాయంత్రం ఆరు గంటలకు టీటీడీ మైదానంలో అభయ్ పేరుతో యువజన కార్యక్రమం నిర్వహించారు. దీంతో మూడు రోజుల జన్మాష్టమి వేడుకలు ముగిశాయి.

బాబు, నాని గెలుపుతో మొక్కుల చెల్లింపులు



చంద్రగిరి, ఆగస్టు 27: మండలంలోని కల్‌రోడ్‌పల్లి పంచాయతీ, బొడింబాయి గ్రామస్తులు ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా నాని గెలుపుతో గ్రామంలోని దేశమ్మకు మాజీ సర్పంచ్ కెసీ నాయుడు, కుటుంబ సభ్యులు మంగళవారం మొక్కులు సమర్పించుకున్నారు. గత సంవత్సరం చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడంతో దిగ్భ్రాంతికి లోనై, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా ప్రజలు సుఖశాంతులతో జీవించాలన్నా వీరిద్దరూ గెలవాలని గ్రామదేవతకు మొక్కుకున్నారు. వారి మొక్కు తీరడంతో గ్రామ ప్రజలతో కలసి ఎమ్మెల్యే నాని దేశమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, కార్యకర్తల అభిమానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగుభాష గొప్పదనాన్ని చాటుదాం



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

రామచంద్రాపురం, ఆగస్టు 27: తెలుగు భాష గొప్పదనాన్ని దేశ, విదేశాల్లో చాటుదామని రాష్ట్ర తెలుగు భాషోద్యమ జిల్లా అధ్యక్షుడు దొడ్డ ఉమామహేశ్వర్ పిలుపునిచ్చారు. కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా మంగళవారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా విద్యార్థులకు తెలుగు భాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రధానోపాధ్యాయురాలు వాగ్దేవి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు విశ్వనాథం, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

400 లీటర్ల సారా ఊట ధ్వంసం



నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన ఊట

ఎర్రావారిపాలెం, ఆగస్టు 27: నాటు సారా కాచేందుకు సిద్ధం చేసిన ఊటను ఎర్రావారిపాలెం పోలీసులు ధ్వంసం చేశారు. నెరబైలు పంచాయతీలో సారా తయారు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై డీఫైస్వామి ఆధ్వర్యంలో పోలీస్ బృందం మంగళవారం నెరబైలు పంచాయతీలోని జిజ్జేపల్లె సమీప ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన ఊట బ్యారెళ్లను కనుగొన్నారు. ఈ బ్యారెళ్లలో ఉన్న సుమారు 400 లీటర్ల సారా ఊటను నేలపై పోసి ధ్వంసం చేశారు. ఈదాడులలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

ఎర్రావారిపాలెం, ఆగస్టు 27: మండల కేంద్రమైన ఎర్రావారిపాలెంలో నూతనంగా నిర్మించిన కోదండరాముడి ఆలయంలో శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. సీతారాముల విగ్రహాలతో పాటు లక్ష్మణ, ఆంజనేయ ఉత్సవ మూర్తుల మూల విరాట్ విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. చెక్కభజనలు, కోలాటల నడుమ ఉత్సవ మూర్తులకు పుర ప్రజలు మంగళహారతులు పట్టారు. మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుంది. భక్తులకు భోజన వసతులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

శ్రీరామ ఇంజనీరింగ్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తిరుపతి రూరల్, ఆగస్టు 27: కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర మాట్లాడుతూ.. పలువురు విద్యార్థులు 120 యూనిట్ల రక్తాన్ని దానం చేశారని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారికి చేయూతనందించడమే కాకుండా మానసిక వికాసం కలుగుతుందని చెప్పారు. కళాశాల డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వాసు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, హెడ్లు, అధ్యాపకులు బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు భూములు దక్కే వరకు పోరాడతాం



దళిత రైతు పొలాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ కమిటీ సభ్యులు

భాకరాపేట, ఆగస్టు 27: దళితుల భూములు వారికి దక్కే వరకు పోరాడతామని స్టేట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వరదరాజులు తెలిపారు. మండలంలోని ఎగవూరు పంచాయతీ ముడుపుకుంట్ల మాదిగపల్లెకు చెందిన రైతు ఎర్రయ్యకు ఇదే రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు 7/3లో 1.70 ఎకరాల భూమి ఉంది. మంగళవారం ఆయన ఈ పొలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... ఈ భూమిని కొలతలు వేసి రైతు ఎర్రయ్యకు రెవెన్యూ అధికారులు వెంటనే న్యాయం చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గురుశంకర్, ఆదినారాయణ, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుడి హుండీ ఆదాయం రూ.4.26 కోట్లు

తిరుమల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.26 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 76,910 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,320 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



శ్రీనివాస్ - మణకల్ ఎస్ వైద్య

తిరుమల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక మంత్రి మణకల్ ఎస్ వైద్య, ఇంటెలిజెన్స్ ఎస్పీ శ్రీనివాస్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

అమర ఆస్పత్రిలో తెగిన బొటనవేలికి శస్త్రచికిత్స



శస్త్రచికిత్స ద్వారా అతికించిన వేలును చూపుతున్న బాధితుడు

రేణిగుంట, ఆగస్టు 27: ప్రమాదవశాత్తు తెగిపడిపోయిన బొటనవేలును శస్త్రచికిత్స చేసి అతికించినట్లు అమర ఆస్పత్రి డాక్టర్ వాసుదేవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లెకు చెందిన చిన్నారెడ్డికి ప్రమాదవశాత్తూ బొటనవేలు తెగిపోయిందన్నారు. ఐస్‌బాక్సులో బొటనవేలిని భద్రపరిచి నాలుగు గంటల లోపు ఆస్పత్రికి తీసుకువచ్చారని, దాదాపు మూడు గంటల పాటు శస్త్రచికిత్స చేసి తెగిన బొటనవేలిని అతికించినట్లు తెలిపారు. మరో ఆరు నెలల్లో యథాతథంగా బొటనవేలు పనిచేస్తుందన్నారు. ఇప్పటికే అమర ఆస్పత్రిలో ఇలాంటి 25 శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ వాసుదేవరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సీఏవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దశేషవాహనంపై ఉభయ దేవేరులతో ఊరేగుతున్న శ్రీకృష్ణుడు

పెద్దశేషుడిపై శ్రీకృష్ణుడి అభయం

తిరుచానూరు, ఆగస్టు 27: గోకులాష్టమి వేడుకలను తిరుచానూరులో మంగళవారం టీటీడీ ఘనంగా నిర్వహించింది. పద్మావతి అమ్మవారి ఆలయ సమీపంలోని గోశాలలో అర్చకులు, అధికారులు గోపూజ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని బలరామ, కృష్ణ ఆలయంలో అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవర్లకు మధ్యాహ్నం అభిషేకం నిర్వహించారు. అనంతరం సర్వాలంకార శోభితులైన రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు పెద్దశేష వాహనంపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్‌లు మధు, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాళీయమర్ధనుడికి అభిషేకం



ఉట్టి కొడుతున్న స్థానిక యువత

తిరుమల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని కాళీయమర్ధనుడికి మంగళవారం అభిషేకం కార్యక్రమం వైభవంగా జరిగింది. గోకులాష్టమి సందర్భంగా టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో గోగర్భం డ్యామ్‌కు సమీపంలో కాళీయమర్ధనుడైన శ్రీకృష్ణుడిని కన్నులపండువగా అభిషేకించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో విశేషంగా అభిషేకం చేశారు. తర్వాత అన్నప్రసాద వితరణ చేశారు. స్థానిక యువకులు ఉట్లోత్సవంలో పాల్గొని, ఉట్టిని కొట్టేందుకు పోటీ పడుతూ అందరినీ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఇతర అధికారులు, గార్డెన్ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా వేణుగోపాలస్వామి చక్రస్నానం



రామచంద్రాపురం, ఆగస్టు 27: రామాపురం గోవర్ధనగిరి చిన్మయ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం చక్రస్నానం వైభవంగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు సుగంధపరిమళ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం 11గంటలకు శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్ఛరణల మధ్య చక్రస్నానం నిర్వహించారు. వివిధ పూజల అనంతరం సాయంత్రం ఆలయం వద్ద ఉట్లోత్సవం నిర్వహించగా, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య కార్యదర్శులు సూర్యనారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుచ్చిపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు



చంద్రగిరి, ఆగస్టు 27: రోహిణీ నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్థానికులు కర్పూర హారతులుపట్టి నీరాజనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకశ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, టెంపుల్ ఏఈవో గోపీనాథ్, అర్చకస్వాములు పాల్గొన్నారు.

ఘనంగా బాలగంగమ్మ జాతర



జాతరలో పాల్గొన్న మహిళలు



ప్రత్యేక అలంకారంలో బాలగంగమ్మ

మంగళం, ఆగస్టు 27: మంగళం పంచాయతీ చంద్రబాబు నాయుడు కాలనీలో మంగళవారం స్థానిక గ్రామదేవత బాలగంగమ్మ గంగజాతరను ఆలయ కమిటీ, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామప్రజలు అంబళ్లు పోసి, పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన గుంత

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



మంగళం, ఆగస్టు 27: మంగళం ఆర్టీవో కార్యాలయం నుంచి శెట్టిపల్లి గ్రామం రైల్వేగేటు వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండటంతో ఇటుగా ప్రయాణం చేసే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు ఇంత వరకు పూర్తి కాకపోవడంతో స్థానికులు, వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. టీటీడీ నిధులతో 80 అడుగుల రోడ్డు పనులు ప్రారంభం కావడంతో మంగళంలోని ప్రజలు, శెట్టిపల్లి మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు. 80 అడుగుల మార్గంలో తెలుగుగంగ పైపులైన్, గ్యాస్ పైపులైన్ ఉండటంతో లీకేజీలను సరిచేసుకుంటూ పనులు ముందుకు సాగించారు. రోడ్డు వెడల్పులో భాగంగా తవ్వుతున్న సమయంలో గ్యాస్‌పైపులైన్ బయటపడింది. ఈ మరమ్మతును గ్యాస్ పైపులైన్‌కు సంబంధించిన వారే చేయాలని గత 20రోజులుగా వెడల్పాటి గుంతగా చేసి విడిచిపెట్టేశారు. తెలుగుగంగ పైపులైన్ లీకేజీ, వర్షపునీరు చేరడంతో గుంత ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ఈ గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్, గ్యాస్ పైపులైన్ నిర్వాహక సిబ్బంది స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న నాగరాజు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 27: మహిళలు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించొద్దని రాస్ పొదుపు సంఘాల డైరెక్టర్ వి.నాగరాజు అన్నారు. శనివారం రాస్ ప్రధాన కార్యాలయంలో పొదుపు సంఘాల సభ్యులకు టాటా క్యాన్సర్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ పరీక్షలను ఆయన ప్రారంభించారు. టాటాట్రస్ట్ పీఆర్‌వో హేమంత్ కుమార్, రాస్ సిబ్బంది ఎల్.బాలాజి, మాధవి, నాగేశ్వర్, సరళమ్మ, దీప పాల్గొన్నారు.

తిరునామం అమలేది తిరుమలేశా?

● పునః ప్రారంభించాలని కోరుతున్న భక్తులు



భక్తులకు నామాలు పెడుతున్న శ్రీవారి సేవకులు (ఫైల్ ఫొటో)

తిరుమల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు తిరునామం దిద్దే కార్యక్రమం కనుమరుగైపోయింది. హిందూ సంప్రదాయానికి అద్దంపట్టేలా, భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందించేలా కొన్నేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఈకార్యక్రమం ఆగిపోయింది. భక్తులందరూ తిలకధారణ చేసుకుని శ్రీవారిని దర్శించుకోవాలనే లక్ష్యంతో 2017లో అప్పటి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆమేరకు శ్రీవారి సేవకులతో ప్రత్యేకంగా తయారు చేయించిన అచ్చులతో మూడు నామాలు, ఏక నామం పెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంపార్టుమెంట్లలోకి ప్రవేశించే భక్తులతోపాటు ఆలయ నాలుగు మాడవీధులు, వరాహస్వామి ఆలయం వద్ద శ్రీవారి సేవకులను ఏర్పాటు చేశారు. కొంతకాలం పాటు ఈకార్యక్రమం విజయవంతంగా సాగింది. కొన్నేళ్లుగా కనిపించకుండా పోయింది. దీంతో కొందరు హాకర్లు రంగప్రవేశం చేశారు. నామాలు పెడతామంటూ భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమంలోనూ కొందరు భక్తులు.. శ్రీవారి సేవకులతో తిరునామం పెట్టే కార్యక్రమాన్ని అమలు చేయాలని కోరారు. అందువల్ల ఈ కార్యక్రమాన్ని పునఃప్రారంభించే అంశంపై టీటీడీ పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది.



ఎస్వీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్

7 నుంచి కాణిపాకం బ్రహ్మోత్సవాలు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 27: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 7 నుంచి 27వ తేది వరకు నిర్వహించనున్నారు. సెప్టెంబరు 7న వినాయక చవితి వేడుకలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 8న ధ్వజారోహణం, హంస వాహనం, 9న నెమలి వాహనం, 10న మూషిక వాహనం, 11న శేష వాహనం, 12న ఉదయం నిలుక వాహనం, రాత్రి వృషభ వాహనం, 13న గజ వాహనం, 14న రథోత్సవం, 15న బిక్షాండి, సాయంత్రం తిరుకల్యాణం, రాత్రి అశ్వవాహనం, 16న సాయంత్రం ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంత సేవ,తో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. అనంతరం ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా 17న అధికారనంది వాహనం, 18న రావణబ్రహ్మవాహనం, 19న యాళివాహనం, 20న విమానోత్సవం, 21న పుష్పపల్లకి సేవ,22న కామధేను వాహనం, 23నసూర్యప్రభ, 24నచంద్రప్రభ, 25న కల్పవృక్షవాహనం, 26న పూలంగిసేవ, 27న తెప్పోత్సవంతో ప్రత్యేక ఉత్సవాలు ముగుస్తాయి.

'తీపి' కబురు



కొత్త ప్యాకింగ్‌లో చక్కెర

రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. సెప్టెంబరు నెల నుంచి బియ్యంతో పాటు చక్కెర పంపిణీకి చర్యలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పౌరసరఫరాల శాఖ ప్రక్షాళనపై దృష్టి సారించిన విషయం తెలిసిందే. సరుకుల సరఫరాలో అనేక అవకతవకలు గుర్తించి, చక్కదిద్దేందుకు రెండు నెలలుగా చక్కెర పంపిణీ నిలిపివేసింది. సెప్టెంబరు నుంచి కొత్త ప్యాకింగులో పంచదార పంపిణీకి రంగం సిద్ధం చేసింది. గత వైసీపీ ప్రభుత్వం రేషన్‌పై నిత్యవసరాలను తగ్గిస్తూ చివరకు బియ్యానికే పరిమితం చేసింది. ఎంతో కీలకమైన కందిపప్పును ఏడాదిగా నిలిపివేసింది. మూడునెలల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కార్డుదారులకు సరకుల సరఫరాపై జిల్లాలవారీగా లబ్ధిదారులు, డీలర్లు, ఎండీయూ వాహనదారులతో సర్వే చేపట్టింది. కాగా, జిల్లాలో 5,43,202 బియ్యం కార్డులు ఉన్నాయి. కార్డుదారుల్లో ఒక్కొక్కరికి 5 కిలోల వంతున ఉచిత బియ్యం, నగదుకు అరకిలో చక్కెర ఇస్తారు. వచ్చేనెల నుంచి కొత్త ప్యాకింగ్‌తో పాటు నిల్వవున్న పాత ప్యాకింగ్‌లోని చక్కెర పంపిణీ చేస్తామని డీఎస్వో శంకరన్ తెలిపారు.

- చిత్తూరు కలెక్టరేట్

పుంగనూరు బస్సును ఢీకొన్న టిప్పర్

● డ్రైవర్‌కు తీవ్రగాయాలు



నెల్లూరు (క్రైం), ఆగస్టు 27 : నెల్లూరు నగరంలో మంగళవారం అర్ధరాత్రి ఆర్టీసీ ఇంద్ర సర్వీసు బస్సును ఓ ట్రక్కు ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చిత్తూరు జిల్లా పుంగనూరు డిపోకు చెందిన ఈ బస్సు విజయవాడ నుంచి పుంగనూరుకు బయలుదేరింది. అర్ధరాత్రి 12.40 గంటల ప్రాంతంలో నెల్లూరులోని కేవీఆర్ పెట్రోలు బంకు సమీపంలో బస్సును ఓ టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. బస్సు డ్రైవర్ డీఎస్ ఖాన్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.పలువురు ప్రయాణికులు కూడా గాయపడినట్లు సమాచారం. స్థానికులు, పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

నేడు, రేపు చెన్నై-తిరుపతి మెము రైళ్ల రద్దు

చెన్నై, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): అరక్కోణం యార్డ్‌లో మరమ్మతుల కారణంగా చెన్నై సెంట్రల్-తిరుపతి మెము రైళ్ల సేవలు ఈ నెల 28, 29, సెప్టెంబరు 1వ తేదీన పూర్తిగా రద్దయ్యాయి. ఈ మేరకు దక్షిణ రైల్వే మంగళవారం ప్రకటన విడుదల చేసింది. ●నెం.06727 డా.ఎంజీఆర్ సెంట్రల్ నుంచి ఉదయం 9.50 గంటలకు తిరుపతికి బయల్దేరే మెము, తిరిగి నెం.06728 తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.35 గంటలకు డా.ఎంజీఆర్ సెంట్రల్‌కు బయల్దేరే మెము రైళ్లు బుధ, గురువారాల్లో పూర్తిగా రద్దు. ● నెం.16054 డా.ఎంజీఆర్ సెంట్రల్ నుంచి ఉదయం 10.10 గంటలకు తిరుపతి బయల్దేరే మెము ఎక్స్‌ప్రెస్, తిరిగి తిరుపతి నుంచి మధ్యాహ్నం 2.25 గంటలకు చెన్నై బయల్దేరే ఎక్స్‌ప్రెస్ రైళ్లు సెప్టెంబరు 1వ తేదీన పూర్తిగా రద్దు.

రాజన్న ఫౌండేషన్‌కు సీఎస్ఆర్ టైమ్స్‌గోల్డ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సతీష్ రాళ్లపల్లి

రేణిగుంట, ఆగస్టు 27: అమరరాజా కంపెనీ సౌజన్యంతో నడిచే రాజన్న ఫౌండేషన్ నైపుణ్యాభివృద్ధి విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన సీఎస్ఆర్ టైమ్స్ గోల్డ్ అవార్డు దక్కించుకుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఫౌండేషన్ అందించిన సేవలను గాను గోవా రాజ్‌భవన్‌లో జరిగిన నేషనల్ సీఎస్ఆర్ సమ్మిట్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ చేతుల మీదుగా మంగళవారం ఫౌండేషన్ అధికారి సతీష్ రాళ్లపల్లి అవార్డును అందుకున్నారు. అవార్డు రావడం పట్ల రాజన్న ఫౌండేషన్ ఫౌండర్ గల్లా రామచంద్రనాయుడు సంతోషం వ్యక్తం చేశారు. కాగా, 2014లో స్థాపించిన అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఇప్పటివరకు 2వేలమంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి అమరరాజా సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

సమయపాలనపై మహిళలకు అవగాహన



శిక్షణ మెటీరియల్ అందజేస్తున్న నిర్వాహకులు

తిరుపతి (జీవకోన), ఆగస్టు 27: నవభారత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో కట్టకిందపల్లెలో నిర్వహిస్తున్న మహిళా వికాస్ శిక్షణ కేంద్రంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విస్డం క్లబ్ నుంచి సమయపాలనపై ప్రేరణాత్మక సెమినార్ నిర్వహించారు. టైలరింగ్ ఇన్‌స్ట్రక్టర్ సుజాతకు జేఎస్ఎస్ ఫీల్డ్ ఆఫీసర్ సుధాకర్ ట్రైనింగ్ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా విస్డం క్లబ్ నిర్వాహకులు తహసున్నీసా బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం స్థలం కబ్జా దారుణం



నినాదాలు చేస్తున్న కమిటీ సభ్యులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 27: రాస్ భవనం సమీపంలో రహదారికి అనుకుని ఉన్న మఠం స్థలం కబ్జా చేసి.. బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టడం దారుణమంటూ మంగళవారం సాయంత్రం హథీరాం బావాజీ సంరక్షణ కమిటీ ఆందోళన చేపట్టింది. భూకబ్జాదారుల నుంచి మఠం భూములను కాపాడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు గుండాలనాయక్ మాట్లాడుతూ.. ఆర్డీవో కార్యాలయానికి కూతవేటు దూరంలో మఠం స్థలం కబ్జాకు గురైందన్నారు. ఈ విషయం పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. హైదరాబాదుకు చెందిన ఓ కుటుంబం సర్వే నెంబరు 366/1,2,3లో నగరం నడిబొడ్డున అత్యంత ఖరీదైన స్థలాన్ని ఆక్రమించుకుందని విమర్శించారు. తక్షణమే కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు చలపతి నాయక్, ఉపాధ్యక్షులు శివనాయక్, సునీల్‌నాయక్, ప్రసాద్‌నాయక్, బంజారా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గోవులను రక్షించుకుందాం : టీటీడీ ఈవో



పూజల్లో పాల్గొన్న ఈవో శ్యామలరావు, ఎమ్మెల్యే ఆరణి తదితరులు - కళాకారుల ప్రదర్శన

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 27: గోవులను రక్షించుకుందామని టీటీడీ ఈవో శ్యామలరావు పిలుపునిచ్చారు. తిరుపతిలో టీటీడీకి చెందిన గోశాలలో మంగళవారం గోకులాష్టమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా గోపూజలో పాల్గొన్న ఈవో మాట్లాడుతూ.. వేదాలు, పురాణాల్లో పేర్కొన్న విధంగా సకల దేవతా స్వరూపమైన గోవును రక్షించడం ద్వారా సనాతన ధర్మాన్ని పరిరక్షించాలన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ.. గోవు ప్రాధాన్యాన్ని భావితరాలకు తెలియజేయడానికి టీటీడీ గోపూజ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అంతకుముందు ఉదయం ఐదు నుంచి 10.30 గంటల వరకు వేణుగోపాల స్వామికి అభిషేకం, వేణుగానం, తిరుమల వేద పాఠశాల విద్యార్థుల వేదపఠనం, దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భజనలు, కోలాటాలు నిర్వహించారు. 11 నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు హిందూ ధర్మప్రచార పరిషత్ కళాకారుల హరికథ భక్తులను అలరించింది. టీటీడీ జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, గోశాల సంచాలకుడు కె.హరనాథరెడ్డి, నగర ప్రముఖులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ● గోవిందరాజ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం పార్థసారథి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటల నుండి 6.30 గంటల వరకు స్వామి వారికి అభిషేకం, పురాణ ప్రవచనం, ఆస్థానం, నివేదన నిర్వహించారు. ● కపిల తీర్థం ఆలయ ప్రాంగణంలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం సుప్రభాతం, అభిషేకంతో జన్మాష్టమి వేడుకలు జరిగాయి. సాయంత్రం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు వేణుగోపాలుడి వీధి ఉత్సవం, ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం జరిగింది.

సిగ్నల్ వ్యవస్థ అస్తవ్యస్తం



బాలాజీ కాలనీ, ఎన్టీఆర్ సర్కిళ్ల వద్ద పనిచేయని టైమర్లు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 27: నగరంలో సిగ్నల్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రధాన కూడళ్లలో కొన్నిచోట్ల ట్రాఫిక్ లైట్లు, మరికొన్నిచోట్ల టైమర్లు సరిగా పనిచేయడం లేదు. పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన వ్యవస్థ కావడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు, వీఐపీలు, అధికారులు ప్రయాణించే లీలామహల్ సర్కిల్‌లో రెండు, మూడు నెలలుగా ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు వెలగడం లేదు. ఎస్పీ కార్యాలయానికి కూత వేటు దూరంలోని ఎన్టీఆర్ సర్కిల్‌తోపాటు సమీపంలోని బాలాజీకాలనీ సర్కిల్ వద్ద టైమర్లు పనిచేయడం లేదు. దీనివల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు ఎక్కువవుతున్నాయి. లైట్లు వెలగక పోవడంతో దూసుకొచ్చే వాహనాలు ఢీకొని కొందరు గాయపడిన సందర్భాలూ ఉన్నాయి. ఇకనైనా ఎస్పీ తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 27: తీర్థకట్టవీధిలో విద్యుత్ స్తంభాన్ని ఓ కారు ఢీకొట్టింది. ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సోమవారం అర్ధరాత్రి పూటుగా మద్యం తాగిన వ్యక్తి కారును వేగంగా నడుపుతూ వచ్చి తీర్థకట్టవీధిలోని విద్యుత్ స్థంభాన్ని ఢీకొన్నాడు. స్తంభం కూలిపోవడంతో ఆ ప్రాంతం మొత్తం విద్యుత్ సరఫరా ఆగిపోయింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి కారును వదిలి పరారయ్యాడు. కారు యజమాని గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆర్బీఐ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనండి

విద్యార్థులకు కలెక్టర్ పిలుపు


ఆర్బీఐ ప్రతినిధులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 27: ఆర్థికపరమైన అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆర్బీఐ నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొనాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. ఆర్బీఐ 90వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న పోటీలకు సంబంధించి పోస్టర్లను ఆర్బీఐ ఎల్డీఎం విశ్వనాథ్‌రెడ్డితో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. జాతీయ, జోనల్, రాష్ట్ర స్థాయిల్లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జాతీయ స్థాయిలో రూ.10లక్షలు, రూ.8 లక్షలు, రూ.6 లక్షలను ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఇస్తారని చెప్పారు. దేశంలోని ఐదు జోన్ల పరిధిలోనూ బహుమతులు ఉంటాయన్నారు. జోనల్ స్థాయిలో రూ.5లక్షలు, రూ.4లక్షలు, రూ.3లక్షలను, రాష్ట్రస్థాయిలోనూ రూ.2లక్షలు, రూ.1.5 లక్షలు, రూ.లక్షను ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఇస్తారని వెల్లడించారు. 1999 సెప్టెంబరు ఒకటో తేదీ ఆపైన జన్మించిన వారు, 2024 సెప్టెంబరు ఒకటినాటికి 25 ఏళ్లలోపు విద్యార్థులు ఈ క్విజ్ పోటీలకు అర్హులని వెల్లడించారు.

రిజిస్ట్రేషన్ ఇలా..

- www.rbi90quiz.in/students/register లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.
- www.rbi90quiz.in/faqs,www.rbi90quiz.in/practicequiz వెబ్‌సైట్‌లో సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

అవకతవకలపై విచారణ చేయండి

- అంతవరకు బదిలీలను వాయిదా వేయాలి
- వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల డిమాండ్


తిరుపతి వాణిజ్య పన్నుల కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

తిరుపతి(విద్య), ఆగస్టు 27: 'గత ప్రభుత్వ హయాంలో 2.0 పేరిట, శాఖ పునర్విభజన పేరిట జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలి. అప్పటి వరకు బదిలీలను వాయిదా వేయాలి' అని వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు తిరుపతి వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగులు మధ్యాహ్న భోజన సమయంలో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ కార్యాలయంలో ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయించాలని కోరారు. శాఖలో అధికారాల కేంద్రీకరణను తాము వ్యతిరేకిస్తున్నామని నినాదాలు చేశారు. తక్షణం సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్‌ను రద్దు చేయాలని, రీజన్ కార్యాలయాలను రద్దు చేయాలన్నారు. తమ డిమాండ్లన్నీ నెరవేరే వరకు కార్యాలయాలవద్ద భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు. ఏపీ కమర్షియల్ ట్యాక్స్ అసోసియేషన్ నాయకులు పూర్ణం, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో అన్నీ అనర్థాలే..!


పోస్టర్లు విడుదల చేస్తున్న అప్పారావు, భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 27: డ్రగ్స్‌తో అన్నీ అనర్థాలేనని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు అన్నారు. ఎన్ఎస్ఎస్ రూపొందించిన డ్రగ్స్ వ్యతిరేక ప్రచార పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. డ్రగ్స్ తీసుకునేవారి శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బ తింటుందన్నారు. డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో భాగంగా ఈనెల 29న వక్తృత్వం, 30న క్విజ్, 31న ర్యాలీలు నిర్వహించాలని కోరారు. సీడీసీ డీన్ చంద్రాయుడు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దామోదరం, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణ, పలు కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటినుంచి జాతీయ సదస్సు

అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలు - సమగ్రాభివృద్ధికి ఎదురయ్యే సవాళ్లు అంశంపై బుధ, గురువారాల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఎస్వీయూ - పద్మావతి వర్సిటీలకు చెందిన ఎకనమిక్స్ విభాగాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని మహిళా వర్సిటీ సావేరి హాల్లో బుధవారం ఉదయం పది గంటలకు సదస్సు ప్రారంభం కానుంది. మహిళా వర్సిటీ వీసీ ఉమ, శ్రీలంకకు చెందిన ప్రొఫెసర్ అమృతలింగం, రిజిస్ట్రార్ రజని, డీన్ కిరణ్ ప్రసాద్, ఎకనమిక్స్ విభాగాధిపతులు నీరజ, వినోదిని పాల్గొంటారని సదస్సు కన్వీనర్లు డాక్టర్ మాధవి, డాక్టర్ సునీత తెలిపారు.

ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయండి : కమిషనర్


పారిశుధ్య పనుల వివరాలు తెలుసుకుంటున్న మౌర్య

తిరుపతి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజలు అందించే ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి పరిష్కరించాలని అధికారులను కార్పొరేషన్ కమిషనర్ నారపరెడ్డి మౌర్య ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమస్య ఎందుకు పరిష్కారం కాలేదో అన్న విషయాన్ని అర్జీదారుడికి స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, ఆర్వోలు సేతుమాధవ్, వర్మ, ఎంహెచ్‌వో డాక్టర్ యువఅన్వేష్ రెడ్డి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ పాల్గొన్నారు.

చెత్తవేస్తే ఫైన్ వేయండి

నగరంలోని పలు ప్రాంతాలను ఉదయం కమిషనర్ తనిఖీ చేశారు. గురువారెడ్డి సమాధుల సమీపంలోని మస్టర్ గది వద్ద ముఖ ఆధారిత హాజరును పరిశీలించారు. ఆలస్యంగా విధులకు హాజరయ్యేవారిపై చర్యలు తీసుకోవాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. అనంతరం లక్ష్మీపురం సర్కిల్, ఎయిర్‌బైపాస్ రోడ్డు, ఎంఆర్‌పల్లె పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. రోడ్లపైన, కాలువల్లో చెత్తవేసేవారిని గుర్తించి అపరాధ రుసుం విధించాలన్నారు. కాలువల్లో వ్యర్థాల తొలగింపు పనుల్లో అవకతవకలకు పాల్పడితే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనల మేరకే బదిలీలు చేయండి

- ఉన్నతాధికారులకు కలెక్టర్ ఆదేశం


బదిలీలపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(విద్య), ఆగస్టు 27: ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకే ఉద్యోగుల బదిలీలు చేయాలని ఉన్నతాధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఈ అంశంపై మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో పెంచలకిషోర్‌తో కలిసి వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, గ్రామ, వార్డు సచివాలయాలు, గనులు, భూగర్భ, ఇంజనీరింగ్, దేవదాయ, రవాణా, విద్యుత్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్ శాఖల్లో బదిలీలు జరగనున్నట్టు వివరించారు. నిబంధనల మేరకు ఐదేళ్లు పూర్తయినవారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని చెప్పారు. ఎక్కడా ఎలాంటి అవకతవకలు, ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ఉండాలని స్పష్టం చేశారు. బుధవారం చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల కలెక్టర్లతో కలిసి బదిలీలపై తగిన నిర్ణయాలు చేయనున్నట్టు వెల్లడించారు. డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి చెన్నయ్య, గ్రామ, వార్డు సచివాలయ అధికారి సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

జగన్ దిష్టిబొమ్మ దహనం కేసు

కోర్టుకు హాజరైన తెలుగు యువత


కోర్టుకు హాజరైన శేషాద్రి నాయుడు, రామ్మోహన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 27: మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం కేసులో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధులు శేషాద్రి నాయుడు, రామ్మోహన్‌పై గతంలో కేసు నమోదైంది. 143, 307, 353, 506 సెక్షన్ల కింద పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. హత్యాయత్నం కేసు నమోదవడంతో గతంలో వీరిద్దరూ కొంతకాలం అజ్ఞాతంలో ఉండిపోయారు. ఈ కేసులో ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి ఎదుట మంగళవారం వీరు హాజరయ్యారు. సెప్టెంబరు 24వ తేదీకి కేసును వాయిదా వేశారు. తమపై అన్యాయంగా పెట్టిన కేసును న్యాయపరంగానే ఎదుర్కొంటామని ఈ సందర్భంగా శేషాద్రి నాయుడు, రామ్మోహన్ తెలిపారు.

వర్సిటీ పాలకమండళ్లలో విద్యావేత్తలకు స్థానం కల్పించండి : ఏఐడీఎస్‌వో

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 27: యూనివర్సిటీ పాలకమండళ్లలో పారిశ్రామికవేత్తలకు మాత్రమే ప్రాతినిధ్యం పరిమితం చేయడాన్ని ఏఐడీఎస్‌వో తప్పు పట్టింది. నిజానికి పాలకమండళ్లలో విద్యావేత్తలకు స్థానం కల్పించాలని తిరుపతి ఇన్‌చార్జి హరీష్ కోరారు. లేకుంటే యూనివర్సిటీ పాలనను పారిశ్రామికవేత్తలు శాసించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇది యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తికి విఘాతం కల్పించినట్టు అవుతుందన్నారు.

30న జాబ్ మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 27: ఎస్వీయూలో ఈనెల 30వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఎంప్లాయిమెంట్ బ్యూరో ఈ మేళా చేపట్టింది. ఐటీఎం స్కిల్ అకాడమీ, శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్, ఉర్జిత ఎలక్ట్రానిక్స్ ఈ మేళాలో పాల్గొంటాయి. ఆ రోజున ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియం ఎదుట ఉన్న ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో మేళా ప్రారంభం కానుందని వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు తెలిపారు.

రిటైర్డు ఉద్యోగి మృతికి సంతాపం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 27: పద్మావతి వర్సిటీ రిటైర్డు ఉద్యోగి బాలిరెడ్డి మృతిపై ఇన్‌చార్జి వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని సంతాపం వ్యక్తం చేశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న బాలిరెడ్డి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు.

టీటీడీలో డిప్యుటేషన్‌కు స్వస్తి పలకాలి

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



టీటీడీ పరిపాలనా భవనం ముందు నినాదాలు చేస్తున్న చింతా మోహన్

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 27 : టీటీడీలో డిప్యుటేషన్ విధానాలకు స్వస్తి పలికి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. టీటీడీ ఏడీ భవనం ముందు ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను బ్లాక్‌లో విక్రయించే వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలిపిరి సమీపంలోని దేవలోక్‌కు కేటాయించిన 150 ఎకరాల భూములను టీటీడీ ఉద్యోగులకు, ఇళ్లు లేని సామాన్యులకు కేటాయించాలన్నారు. కాంగ్రెస్ హయాంలో అమలు చేసిన ప్రతి మంగళవారం స్థానికులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శనాన్ని పునరుద్ధరించాలని కోరారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి, నేతలు శాంతి యాదవ్, తేజోవతి, వెంకటేష్ పాల్గొన్నారు.

జగన్‌కంటే చంద్రబాబు పాలన బాగుందన్న చింత

కుప్పం: వర్గీకరణకు వత్తాసు పలుకుతూ చంద్రబాబు ఎస్సీల పట్ల విభజించు పాలించు సూత్రాన్ని అమలు చేస్తున్నారని చింతామోహన్ విమర్శించారు. అయితే జగన్ పాలనకన్నా చంద్రబాబు పాలన ఎంతో బాగుందని మెచ్చుకున్నారు. కుప్పంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కుప్పంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని, ఇప్పటికీ స్థానికులు వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. స్థానికంగా పరిశ్రమలు స్థాపించి, ఉపాధి అవకాశాలను కల్పించి యువతను ఆదుకోవాలని కోరారు. ద్రావిడ విశ్వవిద్యాలయంలో సుమారు 250 మంది ఉద్యోగులకు 13 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

త్వరలో ఇంటింటికీ సహజవాయువు సరఫరా

ఏజీ అండ్ పీ ప్రథమ్ సంస్థ ఎండీ


మీడియాకు వివరాలు తెలియజేస్తున్న అఖిలేష్ గుప్తా

తిరుపతి అర్బన్, ఆగస్టు 27: విద్యుత్ తరహాలోనే సహజవాయువు(నేచురల్ గ్యాస్)ను త్వరలో ఇంటింటికీ సరఫరా చేయనున్నామని ఏజీ అండ్ పీ ప్రథమ్ సంస్థ ఎండీ, సీఈవో అఖిలేష్‌గుప్తా వెల్లడించారు. మంగళవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రూ.3,500కోట్ల పెట్టుబడితో సమగ్ర గ్యాస్ పైప్‌లైన్ నెట్‌వర్క్ అభివృద్ధి జరుగుతోందన్నారు. సిలిండర్ల రూపంలో కాకుండా పైపులైన్ల ద్వారా శ్రీసిటీ పరిశ్రమ భాగస్వామ్యంతో తక్కువ ధరలకు, పర్యావరణ రహిత సహజవాయువును అందించడమే తమ లక్ష్యమన్నారు. గృహ అవసరాలకే కాకుండా వాణిజ్యపరంగానూ గ్యాస్ సరఫరా చేయనున్నట్లు చెప్పారు. సాధారణ గ్యాస్‌తో పోలిస్తే 20శాతం తక్కువగా ధరలకే విక్రయిస్తామన్నారు. వినియోగాన్ని అనుసరించి ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే శ్రీసిటీలోని అన్ని పరిశ్రమలకు, ఉద్యోగుల వాహనాలకు, గృహ అవసరాలకు సహజవాయువును అందిస్తున్నామని గుర్తు చేశారు. రెండో దశలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, నెల్లూరు, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో సరఫరా చేయడానికి ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. రీజనల్‌హెడ్ గౌతమ్‌ఆనంద్ సహజవాయువు మాట్లాడుతూ.. తిరుపతి నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 80562 13276 నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఆధ్యాత్మిక వాతావరణంలో చవితి వేడుకలు


సమావేశంలో ప్రసంగిస్తున్న సామంచి శ్రీనివాస్

తిరుపతి (జీవకోన), ఆగస్టు 27: ఆధ్యాత్మిక వాతావరణంలో వినాయక చవితి వేడుకలను నిర్వహించుకుందామని వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో కమిటీ సభ్యులతో కలిసి నిమజ్జన వేడుకలపై సమీక్షించారు. రికార్డు డ్యాన్సులు, సినిమా పాటలను నిషేధిస్తూ భక్తితో కూడిన వాతావరణంలో వేడుకలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. 23 ఏళ్లుగా రాజకీయాలకు అతీతంగా ఎంతో క్రమశిక్షణతో వేడుకలను నిర్వహించుకుంటున్నామని గుర్తుచేశారు. ఇక వినాయకసాగర్ అభివృద్ధిలో తమ కమిటీ పాత్ర ఎంతో ఉందన్నారు. సాగర్ మధ్యలో నాట్య గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించడమే లక్ష్యంగా రానున్న రోజుల్లో కృషి చేయాలని తీర్మానించారు. సభ్యులు ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, భానుప్రకాష్‌రెడ్డి, మాంగాటి గోపాల్‌రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, పొన్నాల చంద్ర, వెంకటేష్, కరాటే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛను విధానాన్నే అమలు చేయాలి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 27: కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పాత పింఛను విధానాన్నే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పెన్షన్ రూపంలో అందాల్సిన చట్టబద్ధమైన బకాయిలు ఇవ్వకుండా ఏకీకృత పింఛను (యూపీఎస్) విధానం అమలు చేస్తామని ప్రకటించడంలో కుట్ర దాగి ఉందని పేర్కొన్నారు.

నేత్ర దానం పవిత్రమైంది: కలెక్టర్


వైద్యాధికారులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్

తిరుపతి (విద్య), ఆగస్టు 27: నేత్ర దానం అత్యంత పవిత్రమైనదని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ మధుబాబు, డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందే ప్రతీ అర్జీని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సెప్టెంబరు ఒకటో తేదీన ఉదయం ఆరు గంటలనుంచే ప్రారంభించాలని చెప్పారు. తొలిరోజే వంద శాతం పూర్తయ్యేలా తీసుకోవాలని సూచించారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల రిలే దీక్ష



తిరుపతి(విద్య), ఆగస్టు 27: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజన్ మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్‌లో మూడు పూటలకు కలిపి రూ.90 ఖర్చు అవుతుందని ప్రభుత్వం చెబుతోందన్నారు. మరి ప్రభుత్వ హాస్టళ్లలో రూ.53లకే మంచి భోజనం ఎలా వస్తుందని ప్రశ్నించారు. ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న కాస్మెటిక్స్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన 77 జీవోను రద్దుచేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలన్నారు. అనంతరం సంఘం ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉదయ్‌కుమార్, నవీన్, ప్రవీణ్‌కుమార్, వినయ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భారత ఆర్థిక వ్యవస్థ మూడో స్థానానికి చేరుకోవాలి

రూ.5కోట్లకుపైగా పన్నులు ఎగవేస్తే క్రిమినల్ కేసులు - జీఎస్టీ ఆడిట్ కమిషనర్ ఆనందకుమార్ హెచ్చరిక



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 27: 'ప్రధాని మోదీ కలలు కంటున్న వికసిత్ భారత్ ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ ఐదో స్థానం నుంచి 2029 నాటికి మూడో స్థానం చేరుకోవాలి. ఈ విషయంలో పన్ను చెల్లింపుదారుల సహకారం అవసరం' అని జీఎస్టీ ఆడిట్ కమిషనర్ ఆనందకుమార్ తెలిపారు. తిరుపతి జీఎస్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒకే దేశం, ఒకే పన్ను విధానం ఉండాలనే 33 రకాల సెస్సులు, 17 రకాల పన్నులు రద్దు చేసి.. జీఎస్టీ అమలు చేశారని గుర్తుచేశారు. జీఎస్టీ ఆడిట్ ద్వారా దేశ వ్యాప్తంగా రూ.2,676 కోట్లు పన్నులు ఎగవేసినట్లు గుర్తించగా.. అందులో రూ.272 కోట్లు రికవరీ చేసినట్లు ప్రకటించారు. రూ.5కోట్లకు పైగా పన్నులు ఎగవేస్తే మాత్రం క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఇటీవల ఓ ఎరువుల వ్యాపారి చెల్లించాల్సిన రూ.1300 కోట్లు ఎగవేస్తే అతడికి నోటీసులు జారీ చేశామని, ఇందులో రూ.20 లక్షలు సబ్సిడీ ఇవ్వడం జరిగిందన్నారు. కోవిడ్ కారణంగా నాలుగేళ్లగా పన్నులు చెల్లించని వారికోసం కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. ఇందులో భాగంగానే వడ్డీ, అపరాధ రుసుం చెల్లింపులో మినహాయింపు ఇచ్చిందన్నారు. వికసిత్ భారత్‌తో ఇప్పటి వరకు భారత ప్రభుత్వం వివిధ రంగాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.11 లక్షల కోట్లు విడుదల చేయడం జరిగిందని వివరించారు. అందులో భాగంగా ఏపీకి మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.65,000 కోట్లు విడుదల చేసిందన్నారు.

అనంతపురం, కర్నూలులో సబ్ ఆఫీసులు

జీఎస్టీ ఆడిట్ సబ్ ఆఫీసులు కొత్తగా అనంతపురం, కర్నూలులో ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. జీఎస్టీ అమల్లోకి రాకముందు 70 లక్షల మంది పన్నుల చెల్లింపుదారులు ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య 140 లక్షలకు చేరిందన్నారు. రానున్న డిసెంబరులోగా దేశంలోని 532 యూనిట్లు ఆడిట్ చేయాల్సి ఉందని చెప్పారు. గతంలో సిగరెట్లపైన 300 శాతం పన్ను చెల్లిస్తుండగా ప్రస్తుతం నూతన విధానంతో కేవలం 35 శాతం మాత్రమే పన్నుల చెల్లిస్తున్నారని తెలిపారు. వ్యవసాయ రంగం, సూపర్ మాల్స్‌కు ఎలాంటి పన్నులు లేవన్నారు. తిరుపతి జీఎస్టీ ఆడిట్ జాయింట్ కమిషనర్ అంబి, అసిస్టెంట్ కమిషనర్ మాలతి, జీఎస్టీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

గాడి తప్పిన గ్రామీణ వ్యవస్థను పటిష్ఠం చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 27: రాష్ట్రంలో గాడితప్పిన గ్రామీణ వ్యవస్థను పటిష్ఠ పరిచేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు నిధులను కేటాయించలేదన్నారు. దీంతో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గ్రామాభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేక ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలతో పనిలేకుండా సమష్టిగా కృషిచేసి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు నేరుగా గ్రామంలో సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. అధికారులు కూడా గత వైసీపీ ప్రభుత్వంలో లాగా పనిచేయకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు యామిని, ఎంపీపీ గురవయ్య, పుట్టి వెంకటేశ్వర్లు, దుద్దా రాఘవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తహసీల్దారు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లురాజు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వాలతోనే బీజేపీ బలోపేతం



దిశానిర్దేశం చేస్తున్న బాలకృష్ణమనాయుడు

గూడూరు, ఆగస్టు 27: పార్టీ బలోపేతం కావాలంటే విస్తృతంగా సభ్యత్వ నమోదు చేపట్టాల్సి ఉందని బీజేపీ పట్టణాధ్యక్షుడు ఏ.బాలకృష్ణమనాయుడు అన్నారు. మంగళవారం నరసింగరావుపేటలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 1వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేసి 20వేల సభ్యత్వాలు నమోదు చేసేలా కృషి చేయాలన్నారు. పి.కోటేశ్వరరావు, దయాకర్, నరసప్ప, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, బిందురెడ్డి, సురేష్‌బాబు, పద్మ, రమేష్ పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయాలి...

కోట: ప్రతి కార్యకర్తా స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే సైనికుల్లా పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. కోట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా నాయకులు మాట్లాడుతూ... ఒక్కో బూత్‌కి 200 సభ్యత్వాలను చేయాలని ఇందుకోసం నియోజకవర్గంలోని 5 మండలాల నాయకులకు లక్ష్యాన్ని ఇచ్చారు. ఇందుకు సంబంధించి కోట మండల సభ్యత్వ సంయోగ్య ప్రముఖ్‌లుగా పోసిన వెంకయ్యగౌడ్, విశ్వనాథంవాసు, ఎల్. వెంకటేశ్వర్లును బీజేపీ నాయకులు నియమించారు. పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు అంబరీషా, పి.కోటారెడ్డి, పి.సురేష్, ఏ.శ్రీనివాసులు, నిఖేష్ పరుశురాంసాయి, వెంకటేశ్వర్లు, ఏ.కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను బాధ్యతగా చూసుకోవాలి



ఇన్వర్టర్‌ను అందిస్తున్న రామ్మోహన్‌రావు

గూడూరు, ఆగస్టు 27: తల్లిదండ్రులను పిల్లలు బాధ్యతగా చూసుకోవాలని ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు అన్నారు. మంగళవారం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఇన్వర్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విదేశాల్లో మాదిరిగా మన దేశంలో కూడా వృద్ధాశ్రమాలు పెరగడం బాధకరమన్నారు. పిల్లలను ఎంతో ప్రేమగా పెంచి ప్రయోజకులుగా చేసిన తల్లిదండ్రులు నిరాదరణకు గురిచేయడం బాధాకరమన్నారు. ఎ.గోపాల్‌రెడ్డి, నాశిన నాగులు, గిరిబాబు, ధనుంజయరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



గూడూరు అర్బన్, ఆగస్టు 27: స్థానిక సునీత సేవా సంస్థ కార్యాలయంలో మంగళవారం గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారన్నారు. రాజేశ్వరమ్మ, మెహబూబీ, సువర్ణలక్ష్మి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మినీ గురుకులంలో కృష్ణాష్టమి వేడుకలు



గూడూరు అర్బన్, ఆగస్టు 27: స్థానిక గాంధీనగర్ సమీపంలోని మినీ గురుకులంలో మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ... విద్యార్థినులు ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులను అందించారు.

పాఠశాలకు పబ్లిక్ అడ్రస్ సిస్టం వితరణ

చిల్లకూరు, ఆగస్టు 27: మండలంలోని చింతవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు మంగళవారం సుందరరాజ దాతృత్వంతో రూ.20వేల విలువైన పబ్లిక్ అడ్రస్ సిస్టంను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శివసుబ్రమణ్యం, సుగుణమ్మ, మాధవి, పెంచలయ్య, శ్రీనివాసులు, దుర్గాశారద, మేరీస్టెల్లా తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో మొక్కల పంపిణీ



మొక్కల పంపిణీలో చంద్రశేఖర్

గూడూరు, ఆగస్టు 27: పర్యావరణ పరిరక్షణలో భాగంగా జనసేన కార్యాలయంలో మొక్కలను అందుబాటులో ఉంచామని పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు టి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో మొక్కలను నాటేందుకు మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. సెప్టెంబరు 2న క్లీన్ ఆంధ్ర - గ్రీన్ ఆంధ్ర నినాదంతో నియోజకవర్గంలో భారీస్థాయిలో మొక్కలు నాటుతామన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షిస్తామన్నారు. కార్యక్రమంలో మోహన్, మనోజ్‌కుమార్, మహేష్, కార్తీక్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓజిలిలో మోస్తరు వర్షం

ఓజిలి, ఆగస్టు 27 : వేసవిని తలపించిన వేడిమినుంచి మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం కలిగింది. 10 రోజులుగా పెరిగిన ఎండలు, మబ్బులు పట్టినా కురవని వానలతో రోజురోజుకు వేడిమి కారణంగా సెగలు పెరిగిపోయాయి. దీంతో పల్లెవాసులు ఎండలకు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మంగళవారం సాయంత్రం ఉన్నట్టుండి కురిసిన వర్షంతో ఒక్కసారిగా వాతావరణం పూర్తిగా మారిపోయింది. వేసవి తాపం చల్లారిపోయింది. మండలంలోని కురుగొండ, మానమాల, వెంకటరెడ్డిపాళెం, పెద్దపరియ, రాచపాళెంతోపాటు పలు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది.

ప్రజామోదంతోనే పరిశ్రమల ఏర్పాటు

పెళ్లకూరు, ఆగస్టు 27: ప్రజల ఆమోదంతోనే పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని జేసీ శుభమ్ భన్సాల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాలచ్చూరు పారిశ్రామిక పార్కులో బిర్లా కార్బన్ పరిశ్రమ ఏర్పాటు కోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... ప్రజల సమస్యలు, అనుమానాలను తీర్చిన తరువాతే పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు సాగుతామన్నారు. అదేవిధంగా 30 రోజుల వ్యవధిలో ఇక్కడ ఏర్పాటు చేస్తున్న పరిశ్రమపై అనుమానాలు వ్యక్తం చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ... గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించలేక పోయిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అనేక పరిశ్రమలు తీసుకువచ్చామన్నారు. సీఎం చంద్రబాబు, ఐటీ, పరిశ్రమలు, విద్యా శాఖ మంత్రి లోకేశ్ రాష్ట్రంలో విరివిగా పెట్టుబడులు తీసుకొచ్చి పరిశ్రమల ఏర్పాటుకు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఈ ప్రాంతంలో మేనకూరు సెజ్‌తో పాటు, శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీంతో వేలాది మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ప్రస్తుతం ఏర్పాటు కానున్న పరిశ్రమలో స్థానికులకు హెల్పర్లుగా, స్వీపర్లుగా కాకుండా ఇక్కడే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేసి పరిశ్రమలకు అవసరమైన విధంగా శిక్షణ ఇచ్చి కీలక విభాగాల్లో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.నరేంద్రరెడ్డి, దువ్వూరు సతీష్‌రెడ్డి మాట్లాడుతూ... దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన బిర్లా గ్రూపు ఇక్కడ పరిశ్రమను ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. పాలచ్చూరు పంచాయతీని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని, స్థానిక యువతకే 75 శాతం ఉద్యోకావశాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం కోసం మినరల్ వాటర్ ప్లాంట్, వందేళ్లకు పైగా ఉన్న రహదారిని కొనసాగించాలని కోరారు. పర్యావరణ ఇంజినీర్ అశోక్‌కుమార్, తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

గ్రామాలను దత్తత తీసుకోండి

స్థానికులకు ఉద్యోగాలు కల్పించండి

ప్రజాభిప్రాయ సేకరణలో జేసీ



ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న జేసీ శుభమ్ భన్సల్

నాయుడుపేట టౌన్, ఆగస్టు 27 : పరిశ్రమలు ఆయా పంచాయతీల్లో గ్రామాలను దత్తత తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శుభమ్ భన్సల్ అన్నారు. మేనకూరు సెజ్‌లోని గ్రీన్‌టెక్ పరిశ్రమలో రెండో ప్లాంట్‌ను నిర్మించేందుకు ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించారు. 2వ ప్లాంట్ ప్రారంభమైతే మరో 3వేల మందికి ఉద్యోగాలు కల్పించవచ్చన్నారు. స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని జేసీ సూచించారు. అలాగే పరిశ్రమల ప్రాంగణంలో మొక్కలను నాటి వాటి పరిరక్షణ బాధ్యతను పరిశ్రమలే తీసుకోవాలన్నారు.

టీడీపీ, వైసీపీ నేతల వాగ్వాదం

గ్రీన్‌టెక్ పరిశ్రమలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో జేసీ సమక్షంలో టీడీపీ, వైసీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. ముందుగా సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మైక్ తీసుకొని ఈ పరిశ్రమ ఉన్న ద్వారకాపురం గ్రామాన్ని అభివృద్ధి చేయలేదని అంతేకాకుండా ఈ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అదే సమయంలో జడ్పీటీసీ సభ్యురాలు కె. జ్యోతి ఈ పరిశ్రమ వల్ల ఎలాంటి ఇబ్బందులు లేవని, ఉద్యోగాలు కల్పిస్తున్నారని అనడం వాగ్వాదానికి కారణమైంది. కొంతసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడే ఉన్న పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను శాంతింపచేసి సమావేశాన్ని సజావుగా సాగేవిధంగా చర్యలు చేపట్టారు.



సభలో టీడీపీ, వైసీపీ నేతల వాగ్వాదం

నిబంధనల మేరకే బదిలీలు చేయండి: కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 27: ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకే ఉద్యోగుల బదిలీలు చేయాలని ఉన్నతాధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఈ అంశంపై మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో పెంచలకిషోర్‌తో కలిసి వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, గ్రామ, వార్డు సచివాలయాలు, గనులు, భూగర్భ ఇంజనీరింగ్, దేవదాయ, రవాణా, విద్యుత్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, కమర్షియల్ ట్యాక్స్ ఎక్సైజ్ శాఖల్లో బదిలీలు జరగనున్నట్టు వివరించారు. నిబంధనల మేరకు ఐదేళ్లు పూర్తయినవారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని చెప్పారు. అవకతవకలు, ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ఉండాలని స్పష్టం చేశారు. బుధవారం చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల కలెక్టర్లతో కలిసి బదిలీలపై తగిన నిర్ణయాలు చేయనున్నట్టు వెల్లడించారు.



బదిలీలపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి చెన్నయ్య, గ్రామ, వార్డు సచివాలయ అధికారి సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ చేయండి

- అంతవరకు బదిలీలను వాయిదా వేయాలి
- వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల డిమాండ్



తిరుపతి వాణిజ్య పన్నుల కార్యాలయం వద్ద నిరసనలో ఉద్యోగులు

తిరుపతి(విద్య), ఆగస్టు 27: 'గత ప్రభుత్వ హయాంలో 2.0 పేరిట, శాఖ పునర్విభజన పేరిట జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలి. అప్పటివరకు బదిలీలను వాయిదా వేయాలి' అని వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు తిరుపతి వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగులు మధ్యాహ్న భోజన సమయంలో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ కార్యాలయంలో ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయించాలని కోరారు. శాఖలో అధికారాల కేంద్రీకరణను తాము వ్యతిరేకిస్తున్నామని నినాదాలు చేశారు. తక్షణం సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్‌ను రద్దు చేయాలని, రీజన్ కార్యాలయాలను రద్దు చేయాలన్నారు. తమ డిమాండ్లన్నీ నెరవేరే వరకు కార్యాలయాలవద్ద భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు. ఏపీ కమర్షియల్ ట్యాక్స్ అసోసియేషన్ నాయకులు పూర్ణం, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన్నారుపోలూరు రోడ్డు గుంతలమయం




పెట్రోల్ బంక్ వద్ద ఏర్పడిన గుంత- వట్రపాలెం సమీపంలో నడిరోడ్డులో గుంత

సూళ్లూరుపేట, ఆగస్టు 27: సూళ్లూరుపేట నుంచి మన్నారుపోలూరుకు వెళ్లే రోడ్డు అక్కడక్కడా గుంతలతో వాహన చోదలకు అవస్థలు తప్పడం లేదు. వట్రపాలెం నుంచి మన్నారుపోలూరు కోనేరు వరకు నడిరోడ్డులో పలుచోట్ల గుంతలున్నాయి. గత ఏడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కాళంగి యేరు ఉధృతంగా ప్రవహించింది. ఆ నీరు రోడ్డుపై ప్రవహించడంతో చిన్నపాటి గుంతలు ఏర్పడ్డాయి. అనంతరం కురిసిన చిన్నపాటి వర్షాలలకు వాహనాల రాకపోకలకు కంకర లేచి పెద్ద గుంతలయ్యాయి. ఈ గుంతల్లో ద్విచక్ర వాహనదారులు పడిపోయిన సంఘటనలున్నాయి. సూళ్లూరుపేట నుంచి జిల్లా కేంద్రానికి మన్నారుపోలూరు మీదుగా వెళ్లాలి. ఈ రోడ్డులో గుంతలు ఉండడంతో రాత్రి సమయాల్లో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చాల్సిన అవసరం ఉంది.

భారత ఆర్థిక వ్యవస్థ మూడో స్థానానికి చేరుకోవాలి

- రూ.5కోట్లకుపైగా పన్నులు ఎగవేస్తే క్రిమినల్ కేసులు
- జీఎస్టీ ఆడిట్ కమిషనర్ ఆనందకుమార్ హెచ్చరిక



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 27: 'ప్రధాని మోదీ కలలు కంటున్న వికసిత్ భారత్ ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ ఐదో స్థానం నుంచి 2029 నాటికి మూడో స్థానం చేరుకోవాలి. ఈ విషయంలో పన్ను చెల్లింపుదారుల సహకారం అవసరం' అని జీఎస్టీ ఆడిట్ కమిషనర్ ఆనందకుమార్ తెలిపారు. తిరుపతి జీఎస్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒకే దేశం, ఒకే పన్ను విధానం ఉండాలనే 33 రకాల సెస్సులు, 17 రకాల పన్నులు రద్దు చేసి.. జీఎస్టీ అమలు చేశారని గుర్తుచేశారు. జీఎస్టీ ఆడిట్ ద్వారా దేశవ్యాప్తంగా రూ.2,676 కోట్లు పన్నులు ఎగవేసినట్లు గుర్తించగా.. అందులో రూ.272 కోట్లు రికవరీ చేసినట్లు ప్రకటించారు. రూ.5కోట్లకుపైగా పన్నులు ఎగవేస్తే మాత్రం క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఇటీవల ఓ ఎరువుల వ్యాపారి చెల్లించాల్సిన రూ.1300 కోట్లు ఎగవేస్తే అతడికి నోటీసులు జారీ చేశామని, ఇందులో రూ.20 లక్షలు సబ్సిడీ ఇవ్వడం జరిగిందన్నారు. కోవిడ్ కారణంగా నాలుగేళ్లుగా పన్నులు చెల్లించని వారికోసం కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. ఇందులో భాగంగానే వడ్డీ, అపరాధ రుసుం చెల్లింపులో మినహాయింపు ఇచ్చిందన్నారు. వికసిత్ భారత్‌తో ఇప్పటి వరకు భారత ప్రభుత్వం వివిధ రంగాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.11 లక్షల కోట్లు విడుదల చేయడం జరిగిందని వివరించారు. అందులో భాగంగా ఏపీకి మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.65,000 కోట్లు విడుదల చేసిందన్నారు.

అనంతపురం, కర్నూలులో సబ్ ఆఫీసులు

జీఎస్టీ ఆడిట్ సబ్ ఆఫీసులు కొత్తగా అనంతపురం, కర్నూలులో ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. జీఎస్టీ అమల్లోకి రాకముందు 70 లక్షల మంది పన్నుల చెల్లింపుదారులు ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య 140 లక్షలకు చేరిందన్నారు. రానున్న డిసెంబరులోగా దేశంలోని 532 యూనిట్లు ఆడిట్ చేయాల్సి ఉందని చెప్పారు. గతంలో సిగరెట్లపైన 300 శాతం పన్ను చెల్లిస్తుండగా ప్రస్తుతం నూతన విధానంతో కేవలం 35 శాతం మాత్రమే పన్నుల చెల్లిస్తున్నారని తెలిపారు. వ్యవసాయ రంగం, సూపర్ మాల్స్‌కు ఎలాంటి పన్నులు లేవన్నారు. తిరుపతి జీఎస్టీ ఆడిట్ జాయింట్ కమిషనర్ అంబి, అసిస్టెంట్ కమిషనర్ మాలతి, జీఎస్టీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

ఉపాధి అవకతవకలపై డ్వామా పీడీ ఆగ్రహం

- రూ.2.36 లక్షల రికవరీ



ఉపాధి హామీ పథక సిబ్బందిని ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ

డక్కిలి, ఆగస్టు 27: ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై డ్వామా పీడీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ పథక బహిరంగ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని 27 పంచాయతీల్లో 2023-24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ బృందం నివేదికను చదివి వినిపించింది. ఈ సందర్భంగా పలు పంచాయతీల్లో మస్టర్లు లేకుండానే నిధులు డ్రా చేయడం, కొలతల్లో తేడాలను గమనించిన ఆయన ఉపాధి సిబ్బందిపై మండిపడ్డారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 16వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీలకు సంబంధించి అన్ని వివరాలను బహిరంగంగా వెల్లడించామన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి మండలంలో వివిధ పనులకు సంబంధించి రూ.11.04కోట్ల విలువైన పనులు జరిగాయన్నారు. ఇందులో పలు పంచాయతీల్లో వివిధ రకాల పనులకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యహరించిన సిబ్బందిపై శాఖాపరంగా చర్యలు తీసుకోవడం తోపాటు రూ. 2.36 లక్షల రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. ఇద్దరిపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని కూలీలకు మరింతగా చేరువ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి.రాజశేఖర్, ఎంపీడీవో ప్రసన్న కుమారి, ఏపీడీ వరప్రసాద్, ఏపీవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీఐ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనండి

విద్యార్థులకు కలెక్టర్ పిలుపు

తిరుపతి(విద్య), ఆగస్టు 27: ఆర్థికపరమైన అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆర్బీఐ నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొనాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. ఆర్బీఐ 90వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న పోటీలకు సంబంధించి పోస్టర్లను ఆర్బీఐ ఎల్డీఎం విశ్వనాథ్‌రెడ్డితో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. జాతీయ, జోనల్, రాష్ట్ర స్థాయిల్లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జాతీయ స్థాయిలో రూ.10లక్షలు, రూ.8 లక్షలు, రూ.6 లక్షలను ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఇస్తారని చెప్పారు. దేశంలోని ఐదు జోన్ల పరిధిలోనూ బహుమతులు ఉంటాయన్నారు. జోనల్ స్థాయిలో రూ.5లక్షలు, రూ.4లక్షలు, రూ.3లక్షలను, అలాగే రాష్ట్రస్థాయిలోనూ రూ.2లక్షలు, రూ.1.5 లక్షలు, రూ.లక్షను ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఇస్తారని వెల్లడించారు. 1999 సెప్టెంబరు ఒకటో తేదీ ఆపైన జన్మించినవారు, 2024 సెప్టెంబరు ఒకటినాటికి 25 ఏళ్లలోపు విద్యార్థులు ఈ క్విజ్ పోటీలకు అర్హులని వెల్లడించారు.

రిజిస్ట్రేషన్ ఇలా..

- www.rbi90quiz.in/students/register లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.
- www.rbi90quiz.in/faqs,www.rbi90quiz.in/practice-quiz వెబ్‌సైట్‌లో సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

వెంకటగిరి టౌన్, ఆగస్టు 27: పట్టణంలోని కాంపాళెం వద్ద నవజీవన్ ఆర్గనైజేషన్ - సీసీ - టీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాజెక్టు నిర్వాహకురాలు కవిత మాట్లాడుతూ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా కార్యక్రమం' ద్వారా ఎయిడ్స్ నివారణ, వాటి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమస్యలను టోల్ ఫ్రీ నెం.1097కు తెలిపితే పూర్తి సమాచారం అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం 16మందికి ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరిత, శిరీష, కల్పన, నళిని, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డక్కిలిలో ఎమ్మెల్యే పర్యటన

డక్కిలి, ఆగస్టు 27 : ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం డక్కిలిలో పర్యటించ నున్నారు. దేవునివెల్లంపల్లి రోడ్డు సెంటరులో ప్రముఖ స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయానికి సంబంధించి ఆర్చి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేస్తారు. అనంతరం డక్కిలి టీడీపీ నాయకులు డి.రత్నాకర రెడ్డి(దేవుడు) కుమారుడి వివాహానికి హాజరు అవుతారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

గ్రామాల్లో ఈ-క్రాప్

కోట, ఆగస్టు 27: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సహాయ వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో ఈ-క్రాప్ నమోదు జరి గింది. ఏడగారుసాగుకు సంబంధించి కొత్తపట్నం, ఉత్తమ నెల్లూరు, కర్లపూడి, వంజివాక, తిమ్మానాయుడుపాళెం, వెంకన్నపాళెం, ఊనుగుంటపాళెం, రుద్రవరం, గూడలి, తిన్నెలపూడిల్లో వరి సాగు చేస్తున్నారు. ఆయా పంటలపై మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ ఆదేశాల మేరకు సహాయ వ్యవసాయ అధికారులు రైతుల సహకారంతో ఈ-క్రాప్ సర్వేలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రధానంగా 1010, సన్నాలు, బీపీటీ 5204 రకాల వరి సాగు చేస్తున్నారు.

ఎన్‌బీకేఆర్‌లో గోపాల్‌రెడ్డి వర్ధంతి



గోపాల్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న డైరెక్టర్ తదితరులు

కోట, ఆగస్టు 27: మండలంలోని విద్యా నగర్ ఎన్‌బీకేఆర్ విద్యా సంస్థల ప్రాంగణంలో జేఎన్ టీయూ మాజీ వీసీ, ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మాజీ చైర్మన్ డాక్టర్ ఐ.గోపాల్‌రెడ్డి 7వ వర్ధంతి మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న గోపాల్‌రెడ్డి కాంస్య విగ్రహానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డితోపాటు ఆయా విభాగాధిపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1979లో ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాల స్థాపించి తొలి ప్రిన్సిపాల్‌గా గోపాల్‌రెడ్డి బాధ్యతలు తీసుకొని ఎన్నో ఉన్నత పదవులను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఆయన ఆశయ సాధనకోసం అందరూ కలసికట్టుగా ముందుకు సాగాలని డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు.

కుటుంబ కలహాలతో ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య

గూడూరు, ఆగస్టు 27: పట్టణంలోని నమాజ్‌కట్ట సమీపంలో ఎలక్ట్రీషియన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 1వ పట్టణ ఎస్‌ఐ శ్రీహరిబాబు తెలిపిన వివరాల మేరకు... నమాజ్‌కట్ట సమీపంలో నివాసం ఉంటున్న శ్రీకాంత్(33) ఎలక్ట్రీషియన్. కుటంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాను హుక్కుకు ఉరి వేసుకున్నాడు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన కుటుంబీకులు శ్రీకాంత్ ఉరి వేసుకుని ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా శ్రీకాంత్‌కు భార్య, కుమార్తె ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గూడూరు, ఆగస్టు 27: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని విందూరు గ్రామ సమీపంలో కైవల్యా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను, పంబలేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పురిటిపాళెం సమీపంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

లాడ్జీల్లో నిబంధనలు పాటించాలి

సూళ్లూరుపేట, ఆగస్టు 27: పట్టణంలో లాడ్జీ నిర్వాహకులు నిబంధనలు తప్పని సరిగా పాటించాలని సీఐ మురళీకృష్ణ అన్నా రు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో లాడ్జీ యజమానులతో సీఐ సమావేశం నిర్వహించారు. లాడ్జీలకు వచ్చే వారి వివరాలు తప్పని సరిగా నమోదు చేయాలన్నారు. కొత్త వ్యక్తులు వచ్చినప్పుడు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా బయట వ్యక్తులు మహిళలతో లాడ్జీలకు వచ్చినప్పుడు పూర్తి వివరాలు తెలుసుకొని గదులు ఇవ్వాలని లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

తెగిన బొటనవేలిని అతికించారు

అమర ఆస్పత్రిలో శస్త్రచికిత్స



శస్త్రచికిత్స ద్వారా అతికించిన వేలును చూపుతున్న చిన్నారెడ్డి

రేణిగుంట, ఆగస్టు 27: ప్రమాదవశాత్తు తెగిపడిపోయిన బొటనవేలును శస్త్రచికిత్స చేసి అతికించినట్లు అమర ఆస్పత్రి డాక్టర్ వాసుదేవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లెకు చెందిన చిన్నారెడ్డికి ప్రమాదవశాత్తూ బొటనవేలు తెగిపోయిందన్నారు. ఐస్‌బాక్సులో బొటనవేలిని భద్రపరిచి నాలుగు గంటల లోపు ఆస్పత్రికి తీసుకువచ్చారని, దాదాపు మూడు గంటల పాటు శస్త్రచికిత్స చేసి తెగిన బొటనవేలిని అతికించినట్లు తెలిపారు. మరో ఆరు నెలల్లో యధాతథంగా బొటనవేలు పనిచేస్తుందన్నారు. ఇప్పటికే అమర ఆస్పత్రిలో ఇలాంటి 25 శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ వాసుదేవరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సీఏవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఫౌండేషన్‌కు సీఎస్ఆర్ టైమ్స్‌గోల్డ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సతీష్ రాళ్లపల్లి

రేణిగుంట, ఆగస్టు 27: అమరరాజా కంపెనీ సౌజన్యంతో నడిచే రాజన్న ఫౌండేషన్ నైపుణ్యాభివృద్ధి విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన సీఎస్ఆర్ టైమ్స్ గోల్డ్ అవార్డు దక్కించుకుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఫౌండేషన్ అందించిన సేవలను గాను గోవా రాజ్‌భవన్‌లో జరిగిన నేషనల్ సీఎస్ఆర్ సమ్మిట్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ చేతుల మీదుగా మంగళవారం ఫౌండేషన్ అధికారి సతీష్ రాళ్లపల్లి అవార్డును అందుకున్నారు. అవార్డు రావడం పట్ల రాజన్న ఫౌండేషన్ ఫౌండర్ గల్లా రామచంద్రనాయుడు సంతోషం వ్యక్తం చేశారు. కాగా, 2014లో స్థాపించిన అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఇప్పటివరకు 2వేలమంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి అమరరాజా సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

జాతీయ గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలకు పల్లం విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఏర్పేడు, ఆగస్టు 27: రేణిగుంట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 25, 26వ తేదీల్లో రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు పోటీలు జరిగాయి. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఏర్పేడు మండల పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. టి.శరత్(34కేజీలు), కె.లక్ష్మణ్ (27కేజీలు), సి.సాయిచరణ్(27కేజీలు), హర్షవర్ధన్(34కేజీలు), నాగరాజు (46 కేజీలు), కె.సూర్య (42కేజీలు), ఎం.పవన్‌కుమార్(53కేజీలు) బంగారు పతకాలు, ఇ.గౌతమ్ (22కేజీలు), వి.ఉదయ్‌కిరణ్(27కేజీలు), బి.శ్యామ్ కుమార్ (38కేజీలు), జి.జీవన్ కుమార్ (46కేజీలు), వి.మున్న(38కేజలు), బి.ముని కుమార్ (30కేజీలు), కె.విష్ణు (34కేజీలు), కె.సూర్య(42కేజీలు), ఎం.పవన్ కుమార్ (53కేజీల9), పి.చెంగారెడ్డి (66కేజీలు) రజత పతకాలు, వి.ఉదయ్ కిరణ్ (27కేజీలు), ఎస్.గీతేష్(30కేజీలు), బి.మునికుమార్(30కేజీలు), ఎస్. కార్తీక్ (34కేజీలు), వి.భార్గవ్(38కేజీలు), ఎస్.నాగరాజు(46కేజీలు), కె.విష్ణు (34కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. వీరిలో బంగారు, రజత పతకాలు సాధించిన విద్యార్థులు అక్టోబరులో హర్యానా రాష్ట్రం రోహతక్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతనిధ్యం వహించనున్నారు.

ఐటీడీపీ కోఆర్డినేటర్లకు ప్రశంసాపత్రాలు



ఎమ్మెల్యే నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రుద్రయ్య

నాగలాపురం/బుచ్చినాయుడుకండ్రిగ ఆగస్టు 27: మన ఐటీడీపీ యాప్ ద్వారా టీడీపీకి విధానాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ బలోపేతం కోసం కృషిచేసిన నాగలాపురం మండలం సురుటుపల్లెకు చెందిన రుద్రయ్య, బుచ్చినాయుడుకండ్రిగ మండల ఐటీడీపీ కో ఆర్డినేటర్ రాధాకృష్ణమూర్తి పార్టీ నుంచి ప్రశంశాపత్రం అందుకున్నారు. నారాయణవనంలో జరిగిన కార్యక్రమంలో రుద్రయ్య, రాధాకృష్ణమూర్తిని ఎమ్మెల్యే ఆదిమూలం సన్మానించి ప్రశంసాపత్రం అందించారు.

రిజర్వు ఫారెస్టు ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

వరదయ్యపాళెం, ఆగస్టు 26: బుచ్చినాయుడుకండ్రిగ మండలం కలివెట్టు గ్రామం దగ్గర అంజూరు అటవీ భూమి సర్వే నెంబర్ 295లోని ఎ20, 75సెంట్ల భూమిని కల్కి ట్రస్టు ఆక్రమించినట్లు ఏపీ హేతువాద సంఘం నాయకుడు నార్నె వెంకటసుబ్బయ్య మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అటవీ, రెవెన్యూశాఖల అధికారులు కోట్లాది రూపాయలు విలువైన భూమిని కల్కికి దారాదత్తం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. బాధ్యతారహితంగా వ్యవహరించే అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

మనోహర నాయుడికి మదర్‌థెరిసా అవార్డు



మనోహరనాయుడిని సన్మానిస్తున్న ఎక్స్‌రే సేవా సంస్థ సభ్యులు

నారాయణవనం, ఆగస్టు 27: మండల పరిధిలోని అరణ్యం కండ్రిగకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మనోహర నాయుడును ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ మదర్‌థెరిసా అవార్డుతో సత్కరించింది. సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మనోహర నాయుడుకు మదర్ థెరిసా అవార్డు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎక్స్‌రే సేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఆంజనేయరాజు, సభ్యులు పాల్గొన్నారు.

బత్తలవల్లంలో భూవివాదం

వరదయ్యపాళెం, ఆగస్టు 27: వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం పంచాయతీలో కల్కి ఆశ్రమం వెనుక వైపు ఉన్న అటవీప్రాంతంలో మొక్కలు నాటేందుకు ప్రయత్నించిన అటవీశాఖ అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో అటవీశాఖ పరిధిలో ఉందని అధికారులు, కాదు రెవెన్యూకు సంబంధించిందని రైతులు వాదించారు. రికార్డులు చూపాలని కోరడంతో అటవీ శాఖ అధికారులు వెనుదిరిగారు. స్థానికులు మాట్లాడుతూ సుమారు 62 ఎకరాల భూములను తాము సాగు చేసుకుంటున్నామని తెలిపారు.



అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న స్థానికులు

శ్రీకాళహస్తి

సత్యవేడు

రేపు ఉద్యోగ మేళా

శ్రీకాళహస్తి, ఆగస్టు 27: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం జేకేసీ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీలత తెలిపారు. అపోలో ఫార్మశీ ట్రైనీ కెమిస్ట్‌గా శ్రీకాళహస్తి, సూళ్లూరుపేటలో పనిచేసేందుకు పురుషులకు, తిరుపతి యంగ్ ఇండియా శాఖలో పనిచేసేందుకు 28 సంవత్సరాల లోపు స్త్రీ, పురుషులు, టీసీఎల్‌లో పనిచేసేందుకు 21-32 లోపు స్త్రీ, పురుషుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు గురువారం ఉదయం 10గంటలకు కళాశాల వద్దకు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9985020936 నెంబరును సంప్రదించాలని కోరారు.

వీఆర్‌కు ఏర్పేడు సీఐ

ఏర్పేడు, ఆగస్టు 27: ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులును తిరుపతి వీఆర్‌కు బదిలీ చేశారు. తిరుపతి వీఆర్‌లో ఉన్న జయచంద్రను ఏర్పేడు సీఐగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

యువకుడి అదృశ్యం

ఏర్పేడు, ఆగస్టు 27: ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు చెందిన భాస్కర్(35) వారంరోజులుగా ఇంటికి రాలేదని ఆయన భార్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త సెంట్రింగ్ పనిచేస్తాడని, రోజువారీ వీధుల్లో భాగంగా వారం రోజుల క్రితం ఇంటి వెళ్లాడని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తపై కోడలి దాడి

ఏర్పేడు, ఆగస్టు 27: అత్తపై కోడలు దాడి చేసిన ఘటన ఏర్పేడు మండలం అంజిమేడు గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలకు గ్యాస్ స్టౌ వితరణ

వరదయ్యపాళెం, ఆగస్టు 27: మండలంలోని పాండూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు జనసేన మండలాధ్యక్షుడు చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో రూ.5వేల విలువ గల గ్యాస్ స్టౌను వితరణ చేశారు. దీనిని ప్రధానోపాధ్యాయురాలు విమల స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు తులసీరామ్, విద్యా కమిటీ చైర్మన్ పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



నోటుబుక్కులు అందిస్తున్న మురళి

సత్యవేడు, ఆగస్టు 27: సత్యవేడు మండలం ముదిరాజ్ సేవా సంఘం అధ్యక్షుడు మురళి(కోళ్ల చిన్న) మండలంలోని తొండుకుళి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు వితరణగా అందించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సంఘ సభ్యులతో కలిసి విద్యార్థులకు హెచ్‌ఎం చెంగయ్య చేతుల మీదుగా విద్యాసామగ్రి అందించారు. సభ్యులు నాగరాజు, లక్ష్మీనారాయణ, రామచంద్ర, కుమార్, గురు పాల్గొన్నారు.

విజ్ఞానగిరి పనులను పూర్తి చేయండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 27: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కుమారస్వామి వెలసిన విజ్ఞానగిరి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని పాలకమండలి మాజీ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఆయన విజ్ఞానగిరి వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జోక్యం చేసుకుని పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



గురుకుల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల ఎదుట వైసీపీ హయాంలో ఏర్పాటైన బంకులు - ప్రభుత్వ బాలికల వసతిగృహం ఎదుట సిద్ధమవుతున్న బంకు

ఇదేం చోద్యం

బాలికల విద్యాసంస్థల ఎదుట వెలుస్తున్న బంకులు

తిష్టవేస్తున్న ఆకతాయిలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 27: పట్టణంలోని బాలికల విద్యాసంస్థల ఎదుట పుట్టగొడుగుల్లా బంకులు వెలుస్తున్నాయి. అక్కడే తినుబండారాలు, కూల్ డ్రింక్స్ మాటున సిగరెట్లు, గుట్కా, ఖైనీలు అమ్మకాలు సాగుతుండటంతో ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి. దీంతో పిల్లల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. గత వైసీపీ పాలనలో ప్రజలు వ్యతిరేకిస్తున్నా లెక్కచేయకుండా పలు విద్యాసంస్థల వద్ద బంకులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ విధానాన్ని అనుసరిస్తూ శ్రీకాళహస్తి పట్టణం చెన్నైరోడ్డులోని బాలికల వసతిగృహం ముందర కొందరు బంకు పెట్టేందుకు ఏర్పాట్లు సాగిస్తున్నారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో గత మూడురోజుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతూనే ఉన్నా అధికారుల నుంచి స్పందన లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత వైసీపీ పాలనలో రద్దీ ప్రదేశాల్లో ఖాళీ జాగా కనిపిస్తే చాలు బంకులను ఏర్పాటు చేశారు. మురుగు కాలువలు, విద్యాసంస్థల పరిసరాలను సైతం వదలలేదు. పట్టణ నడిబొడ్డున కొత్తపేటలో ఉన్న జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల గేటు పక్కన ప్రహరీకి ఆనుకుని రాత్రికి రాత్రే రెండు బంకులు ఏర్పాటు చేశారు. గతంలో ఈ పాఠశాల వద్ద పలుమార్లు ఆకతాయిలు రెచ్చిపోయిన ఘటనలు ఉన్నాయి. పదినెలల క్రితం ఓ యువకుడు పాఠశాలలో 9వ తరగతి చదివే బాలికను ఇంటి నుంచి రాకపోకలు సాగించే సమయంలో వెంబడించేవాడు. ఈ క్రమంలో పాఠశాల సమీపంలోనే ఆ బాలికపై చెయ్యి చేసుకోవడం కలకలం రేపింది. పాఠశాల వద్ద గత ప్రభుత్వ హయాంలో రెండు బంకులు ఏర్పాటు కావడం విమర్శలకు దారి తీసింది. ఇప్పటికీ అవి కొనసాగుతున్నాయి. ఇక పట్టణంలోని తెలుగు గంగకాలనీలో గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ఈ పాఠశాలలో ఏడేళ్ల క్రితం బాలికపై ఆగంతకుడు దాడి చేసిన ఘటన సంచలనం రేపింది. 8 నెలల క్రితం సరిగ్గా గురుకుల పాఠశాల గేటు పక్కనే బంకు వెలసింది. పాఠశాలకు ఎదురుగా స్పోర్ట్స్ అథారిటీ క్రీడా మైదానం ఉంది. రాత్రైతే గుంపులు గుంపులుగా మందుబాబులు మైదానంలో తిష్టవేసి గంజాయి, మద్యం సేవిస్తుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. పలుమార్లు రాత్రి వేళ గ్రౌండ్‌లో పూటుగా మద్యం సేవించిన యువకులు రాడ్లు, కత్తులతో దాడులకు పాల్పడిన కేసులు నమోదయ్యాయి. ఏడు నెలల క్రితం మైదానంలో రెండు దాడి ఘటనలపై కేసులు నమోదయ్యాయి. అలాంటి ప్రదేశంలో గురుకుల పాఠశాల గేటు వద్దనే బంకు నిర్వహిస్తుండటంతో ఆకతాయిలకు అడ్డాగా మారిపోయింది. పట్టణంలోని చెన్నైరోడ్డులో ధర్మరాజస్వామి ఆలయానికి ఎదురుగా ఎస్సీ బాలికల 1, 2 వసతిగృహ సముదాయం ఉంది. ఈ వసతి గృహం గేటు పక్కనే రహదారికి ఆనుకుని పది రోజుల నుంచి కొందరు బంకును ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు. మూడు రోజుల నుంచి ఈ బంకు ఏర్పాటుపై సామాజిక మాధ్యమాల్లో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా అధికారుల నుంచి స్పందన రాలేదు. ఈ విషయమై హాస్టల్ వార్డెన్ హేమలత మాట్లాడుతూ వసతిగృహం వద్ద బంకు ఏర్పాటు చేయడంపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. దానిని తొలగించాలని సూచించినా నిర్వాహకులు అందుబాటులో లేరని చెప్పారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

రేషన్ దుకాణాన్ని తరలించొద్దు



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎంజీనగర్‌వాసులు

వరదయ్యపాళెం, ఆగస్టు 27: ఎన్నో ఏళ్లుగా తమ గ్రామంలో ఉన్న రేషన్ దుకాణాన్ని దూరంగా మరో గ్రామానికి తరలిస్తే ప్రాణాలైన అర్పించి అడ్డుకుంటామని మండలంలోని ఎంజీనగర్ గ్రామస్తులు తేల్చి చెప్పారు. తొండంబట్టు పంచాయతీ ఎంజీనగర్‌కు చెందిన గ్రామస్తులు మంగళవారం తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని రేషన్ దుకాణాన్ని తరలించడంపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి చిట్టచివర కొండ ప్రాంతంలోని తమ గ్రామంలో ఎన్నో ఏళ్లగా ఉన్న రేషన్ దుకాణాన్ని అంబికాపురానికి ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకుల కోసం బస్సులు, ఆటో వసతి లేని నాలుగు కిలోమీటర్ల దూరంలో గల అంబికాపురానికి ఎలా వెళ్లి తెచ్చుకోవాలని నిలదీశారు. రాజకీయ కారణాలతో రేషన్ దుకాణాన్ని తరలించి తమను ఇబ్బందిపెట్టవద్దని అధికారులను వేడుకున్నారు. అనంతరం తహసీల్దారు రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు.

కరాటే పోటీల్లో అక్కాచెల్లెళ్లకు బహుమతులు



బహుమతులతో చాతుర్యాశ్రీ, మాధురిశ్రీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 27: చెన్నైలోని పొన్నేరిలో నిర్వహించిన ఇండియా ఓపెన్ కరాటే పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన కరుణాకర్ గుప్తా కుమార్తెలు మాధుర్యశ్రీ ప్రథమ స్థానం, చాతుర్యాశ్రీ తృతీయస్థానంలో నిలిచారు. నిర్వాహకులు భాస్కరన్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరిని కరాటే మాస్టర్ సంపత్ అభినందించారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

సత్యవేడు, ఆగస్టు 27: వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మునిప్రతాప్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ బూత్‌లో కనీసం 200 సభ్యత్వాలను, మండల స్థాయిలో 10వేల సభ్యత్వాలు చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మురళి, నాయకులు మోహన్‌బాబు, వాసు, వెంకటేశులు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి, ఆగస్టు 27: శ్రీకాళహస్తి న్యాయస్థానంలో వచ్చే నెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. మంగళవారం న్యాయస్థాన భవనంలో పలు శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమని, దీనిపై ఎలాంటి అప్పీలు ఉండదని తెలిపారు. కక్షిదారులు ఈ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు బేబీ రాణి, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో వన్నెకుల క్షత్రియులకు అవకాశం కల్పించాలి

శ్రీకాళహస్తి, ఆగస్టు 27: నామినేటెడ్ పోస్టుల్లో వన్నెకుల క్షత్రియులకు అవకాశం కల్పించాలని ఆ సంఘం నాయకులు కోరారు. మంగళవారం వారు పట్టణంలోని వన్నుకుల క్షత్రియ భవన్‌లో సమావేశం నిర్వహించారు. సాధారణ ఎన్నికల్లో వన్నెకుల క్షత్రియులు ఎన్డీఏ కూటమిని ఆదరించారని తెలిపారు. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వన్నెకుల క్షత్రియులతో సమావేశం నిర్వహించి రాజకీయంగా అవకాశాలు కల్పిస్తానని మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఈ మేరకు హామీ నిలబెట్టుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే కమ్యూనిటీ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంఘం నాయకులు మస్తాన్‌రెడ్డి, గురవారెడ్డి, మిన్నల రవి, పేట బాలాజీరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఎంఎస్‌రెడ్డి, దొరైరాజ్‌రెడ్డి, మునెయ్య, బయ్యారెడ్డి, తేజారెడ్డి, మురళిరెడ్డి, డిల్లీ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై దృష్టి సారించండి

సత్యవేడు, ఆగస్టు 27: సత్యవేడు నియోజకవర్గంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్‌ను ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. మంగళవారం జేసీని ఆయన కార్యాలయంలో కలిసిన ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా సత్యవేడు నియోజకవర్గంలో ఇళ్లులేని పేదలకు ఇంటి పట్టాలు మంజూరు, గ్రామాల్లో శ్మశానాలకు స్థలాల కేటాయింపు వంటి వాటిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు. అదే విధంగా సత్యవేడు మండలం వానెల్లూరులో ఎంజీజీ లే అవుట్‌కు స్థలం సేకరించి పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని జేసీని ఎమ్మెల్యే కోరారు.

పుత్తూరు వార్తలు

రేణిగుంట మీదుగా తిరుపతికి బస్సు సర్వీసులు నడపండి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

పుత్తూరు టౌన్, ఆగస్టు 27: పుత్తూరు డిపో నుంచి రేణిగుంట మీదుగా తిరుపతికి బస్సు సర్వీసులు నడపాలని డిపో మేనేజర్ ప్రశాంతికి మంగళవారం సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతికి వెళ్లే బస్సులన్నీ బైపాస్‌లో వెళుతున్నాయని, దీంతో రేణిగుంట రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వినతి పత్రం అందించిన వారిలో సీపీఎం నాయకులు భాస్కర్, యాసీన్ భాష, రాము తదితరులు ఉన్నారు.

ఆర్థిక లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మునివేలమ్మ

పుత్తూరు టౌన్, ఆగస్టు 27: డ్వాక్రా సంఘాల ఆర్థిక లావాదేవీలపై, ఆ సంఘ లీడర్లు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ మునివేలమ్మ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డ్వాక్రా మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ పేద మహిళలను గుర్తించి, సంఘాల్లో చేర్పించి వారికి ఆర్థిక భరోసా కల్పించాలని సూచించారు. డ్వాక్రా సంఘాల సభ్యులు రుణాలు, పొదుపు, జమ తదితర విషయాలను ఎప్పటికప్పుడు ఎంట్రీ వేసుకోవాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో అధికారులు, డ్వాక్రా సంఘాలు లీడర్లు పాల్గొన్నారు.

ఆరేటమ్మకు పాలాభిషేకం



ఆరేటమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు టౌన్, ఆగస్టు 27: పుత్తూరులోని గ్రామదేవత ఆరేటమ్మకు మంగళవారం పాలాభిషేకం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి నిత్యపూజా కైంకర్యాలు చేపట్టారు. అనంతరం భక్తులు తమ స్వహస్తాలతో ఆరేటమ్మ తల్లికి పాలాభిషేకం చేశారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శాలువ కప్పి, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవ నాయుడు, విక్కీరాయల్, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ ఆనంద్, వెంకటేష్, ఉమాశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకుప్పంలో గంగజాతర



అమ్మవారికి పూజలు చేస్తున్న తిరుమలకుప్పం గ్రామస్తులు

పుత్తూరు టౌన్, ఆగస్టు 27: పుత్తూరు మండలం తిరుమల కుప్పంలో గంగజాతర వైభవంగా జరిగింది. నూతలపాటి శ్రీనివాసులు నాయుడు కుటుంబం ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం గ్రామస్తులు పొంగళ్లు పెట్టి గంగమ్మకు నివేదించారు. రాత్రి అమ్మవారిని పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో లాలేకృష్ణ, హేమంత్‌కుమార్, అక్షయఖన్నా, వంశీ, నాగభూషణం, లక్ష్మీనారాయణ, ప్రదీప్, కిరణ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.